
# మిసిమి

మాస పత్రిక

మార్చి-2004



రూ. 8/-



## చిత్రకారుని గురించి

హిట్లర్-జర్మనీ నియంత, తన దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకొని వెళ్ళి, అంతలోనే అథఃపాతాళానికి తోసివేశాడు. అవధులు లేని అధికార దాహంతో చేసిన ప్రయత్నంలో కొన్ని కోట్ల మంది మరణానికి ప్రత్యక్షంగా పరోక్షంగా కారణభూతుడైన వ్యక్తి ప్రపంచ చరిత్రలో మరొకరు లేరు. ఇంతటి ఘాతక కృత్యాలు చేసిన హిట్లర్‌కు లాలిత్యంతో కూడిన పార్శ్వం కూడా ఉంది. పద్యాలు వ్రాయటం, పెయింటింగ్ చేయటం, అంతులేని దేశభక్తి, పట్టుదల, నిరంతర పరిశ్రమ, కాయగూరల భోజనం మొదలైనవి. చిత్రకారునిగా అతని చిత్రానికి 1986లో లభించిన అత్యధిక విలువ రూపాయలలో 5 లక్షల 86 వేలు మాత్రమే. బ్రతుకు తెరువు కోసం గీసి అమ్ముకొన్న తన చిత్రాలను నాజీ నియంత అయిన తరువాత ఏప్రిల్ 25, 1935వ సంవత్సరంలో నేషనల్ సోషలిస్టు జర్మనీ వర్కర్స్ పార్టీతో ఒక సాంస్కృతిక సంస్థను స్థాపించి దాని ద్వారా ఒకనాడు తాను అమ్మిన చిత్రాలను, 5 లేదా 6 వేల మార్కులు చెల్లించి తిరిగి కొనుగోలు చేయించాడు (ఒక మార్కుకు 4 డాలర్లు మారక విలువ).

కొన్ని చిత్రాలను తన మిత్రులయిన గోరింగ్, హెమ్లర్, ముస్సోలనీలకు బహుమతిగా ఇచ్చాడు. 1930 ప్రాంతంలో హిట్లర్ చిత్రాలకు ఫోర్జరీలు ప్రారంభమైనాయి. వాటిని గుర్తించి, సేకరించి తగుల బెట్టించాడు.

**ముఖచిత్రం : నివాస గృహం**

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 15 | మార్చి 2004 | సంచిక 3

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి - III - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ప్రప్రథమ నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత - సల్లీప్రుడ్ హోమ్ — మూలం : సి.డి. అఫ్ విర్‌సెన్, అనువాదం : అనిపెద్ది వెంకటరమణారావు

విజేతలు ఇలా ఉంటారు! - సి.వి. సర్వేశ్వరశర్మ

చరిత్రకారునిగా కంభంపాటి సత్యనారాయణ - టి. రవిచంద్
(21వ వర్ధంతి సందర్భంగా 16-1-2004న స్మారకోపన్యాసం)

చిత్రకారునిగా - హిట్లర్ - కాండ్రేగుల నాగేశ్వరరావు

సమసమాజంలో మానవాత్మ — మూలం : ఆస్కార్ వైల్డ్, అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

విడిప్రతి రూ. 8/-    వార్షిక చందా రూ. 100/-    విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **"హిట్లర్ చిత్రించిన గృహం"**

చిత్రకారుడు : **అడాల్ఫ్ హిట్లర్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

## మిసిమి బుద్ధజయంతి ప్రత్యేక సంచికకు

# రచనల ఆహ్వానం

బౌద్ధాన్ని భారతదేశం తరిమేసి పంపి మహాపాపం చేసిందన్నాడు గురజాడ. కాని కొంతమంది పండితమ్మన్యులు ''బౌద్ధం ఎక్కడికీ పోలేదు, భారతదేశంలో జీర్ణించుకు పోయింది.'' అంటారు లోతుగ చూడకుండానే. మూల బౌద్ధానికి ఆత్మలేదు, సృష్టి కర్త అయిన దేవుడు లేడు, కర్మకాండ క్రతువులు లేవు. ఇవన్నీ హిందూ మతంలో ఉన్నాయి. ఇవి ప్రాథమిక విషయాలు, ఇవి లేకపోతే బౌద్ధం భారతదేశంలో ఎక్కడ ఉన్నట్లు? మరి హిందూ మతం వీటిని అంగీకరిస్తుందా?

★ ★ ★ ★ ★

ప్రపంచం అంతా నిద్దరోతోంది. నడి రేయి సిద్ధార్థ గౌతముడు నిద్రమేల్కొన్నాడు మహాభినిష్క్రమణం చేశాడు. ప్రపంచం సనాతన సంప్రదాయాలలో, కర్మకాండలో వర్ణ వ్యవస్థలో జోగుతోంది. సిద్ధార్థుడు మేల్కొన్నాడు బుద్ధుడయ్యాడు. ప్రపంచాన్ని పెను నిద్ర నుంచి తట్టి లేపాడు.

★ ★ ★ ★ ★

బుద్ధుడు మానవవాది, అనుభవికవాది, సంస్కరణ వాది, స్వతంత్ర వాది. బౌద్ధంలో ఎన్నో అంశాలు ఆధునిక ప్రపంచ గందరగోళానికి ఊరట గలిగించేవిగా ఉన్నాయి.

''ఆధునిక ప్రపంచానికి బౌద్ధం'' అనే అంశాన్ని మనసులో ఉంచుకొని రచయితలు తమ వ్యాసాలను మార్చి మాసాంతం లోగా మిసిమికి చేరేట్లు పంపాలని కోరుతున్నాము.

\- సంపాదకుడు

# ఇరవయ్యో శతాబ్ది మనస్సు గతి III

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఇరవయ్యో శతాబ్దిలో ఫ్రాయిడ్ సిద్ధాంతం ప్రచలితమైనంతగా మరే మనో వైజ్ఞానిక సిద్ధాంతమూ ప్రచలితం కాలేదంటే అతిశయోక్తి కాదు. అయినా దాని నుంచి విడివడిన వారు, విభేదించిన వారు, దాని ననుసరించిన వారు ఎంతో మంది ఉన్నారు. మొత్తం మీద వీరంతా దానిని మూలం చేసుకొని, విమర్శించి, కొన్ని మూర్పులు చేసుకొని, లేదా పూర్తిగా వ్యతిరేకించి తమ తమ సిద్ధాంతాలను ప్రతిపాదించుకొన్నారు.

కరెన్ హార్నై ఫ్రాయిడ్‌తో తలపడింది. ఫ్రాయిడ్ చెప్పిన లైంగిక, దౌర్జన్య ప్రేరణలను, ఆంతరంగిక ఘర్షణల అనివార్యతను తోసిపేసింది. ఈమె, ప్రతిపాదించిన ముఖ్య భావన ప్రాథమిక వ్యాకులత (Basic anxiety), సహకారం తక్కువై, వ్యతిరేకత అంతర్గతంగా ఉన్న ఈ ప్రపంచంలో, వ్యక్తి ఎదుర్కొనే ''ఏకాంత, నిస్సహాయత'' ఈమె ముఖ్య భావన. సమాజంలో వ్యక్తులు ఒకరిమీద ఒకరు ఆధారపడతారు కనుక, సరైన సహకారం అందనప్పుడు వ్యక్తులు 'వ్యాకులతతో కూడిన ఘర్షణను' ఎదుర్కొంటారు. ఒంటరితనం, నిస్సహాయతలను ఎదుర్కోవడానికి పిల్లలో తమ తమ మూర్తిమత్వ నమూనాలను పెంపొందించుకొంటారు. ఫలితంగా వారు దౌర్జన్య ప్రవర్తను లేదా స్వార్థ పర దయనీయ స్థితితో గూడిన ప్రవర్తనను ప్రతిబింబించవచ్చు.

వ్యక్తులు సాధారణంగా మూడు విధాలుగా ఒకరికొకరు సంబంధింప జేసుకొంటారు. ఒకటి, ప్రేమను, సహకారాన్ని ఆధారాన్ని వెతుక్కొంటూ ఒకడు రెండో వాని వైపుకు చలిస్తాడు. రెండు, స్వతంత్రంగా, స్వావలంబనంగా ఉండాలని ఒకడు రెండో వానికి దూరంగా జరుగుతాడు. మూడోది, ఇతరులతో పోటీకి, వారిపై ఆధిపత్యం చెలాయించడానికి, ఒకడు రెండోవానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తాడు. ఆరోగ్యవంతుడు ఈ మూడింటిని సమతూకంతో పాటిస్తే, మానసికంగా అంతగా ఆరోగ్యవంతులు కాని వారు ఈ మూడు పద్ధతులలో దేనిలో ఒకదానిలో కూరుకుపోతారు.

ఫ్రాయిడ్ చెప్పిన శిశ్నేర్ష్య, స్త్రీ న్యూనతలను మొదటిగా సవాలు చేసిన మనో విశ్లేషకురాలు ఈమే. మానవజాతిలో సగం ఉన్న స్త్రీ జాతి, తమకు దత్తమైన లింగం, జెండర్‌తో న్యూనతా భావాన్ని అనుభవిస్తున్నారని వాదించడం హాస్యాస్పదం. స్త్రీలు న్యూనతా భావనతో బాధితులవుతున్నారంటే దానికి కారణాన్ని లింగం, జెండర్‌లలో గాక, సామాజిక వాస్తవికతలో దర్శించాలని ఆమె అంది. అసలు ఈర్ష్య అనేది ఉందంటే, అది మగవారికే ఉంది, స్త్రీలకు కాదు; మగవారికే 'గర్భ ఈర్ష్య' wombeny ఉంది. పిల్లలను కని సాకే శక్తి స్త్రీలకు మాత్రమే ఉన్నందుకు పురుషులలో అసూయ ఉంది. బ్రూనో బెటెల్‌హీమ్ అనే అతడు ఇలా అన్నాడు : ''ఆడ, మగ ఇద్దరూ కూడ వారి వారి ఉత్పాదక సామర్థ్యాలను చూసి ఒకరంటే ఒకరు అసూయ పడేమాట నిజం''.

హార్నై కంటె గూడ సమూలంగా ఫ్రాయిడ్ నుంచి విడిపోయిన వారు ఇద్దరున్నారు. వారు ఆల్‌ఫ్రెడ్ ఆడ్లర్, కారల్‌గూస్టాఫ్ యూంగ్‌లు. వీరిద్దరు మొదట్లో ఫ్రాయిడ్ అనుయాయులు. తరవాత విడిపోయి ఎవరిబడి వారు పెట్టుకొన్నారు.

ఫ్రాయిడ్ ఇడ్‌లో అచేతనంగా దౌర్జన్య లైంగిక సహజాతాలున్నాయన్నాడు. దీనిని ఆడ్లర్ పూర్తిగా కాదని ''ఆధిక్యం కోసం చోదన'' (drive for superiority)ని ప్రతిపాదించాడు. ఆధిక్యం అంటే ఇక్కడ ఇతరుల మీద పెత్తనం కాదు. ఆత్మాభివృద్ధికి అంటే తనను తాను అభివృద్ధి చెందించుకోవడానికి చేసే ప్రయత్నం. మానవుడెప్పుడూ పరిపూర్ణత కోసం ప్రయత్నిస్తాడు. అందుకని అతడు పైపైకి పోకాలని చూస్తాడు. ఈకోర్కె, మనందరిలో అంతర్గతంగా ఉన్న న్యూనతా భావన (inferiority complex) నుంచి పుట్టుకొస్తుంది. మొదట పిల్లలుగ ఉన్నప్పుడు, పెద్దవాళ్ళతో పోల్చుకొని వారికంటె తాను తక్కువ అని అనుభూతి చెందుతారు కనుక, వారిలో న్యూనతా భావన నెలకొంటుంది. ఆ తరవాత మన సామర్థ్యా పరిమితులను చూసి న్యూనతా భావనకు గురవుతాం. ఈ సహజ పరిమితులను ఆమోదించే సామర్థ్యం లేక, వాటికి ముసుగు కప్పి, బలవంతులమని, సమర్థవంతులమని నటిస్తాం. జీవితంలోని వాస్తవిక సమస్యలను నిజంగా ఎదుర్కోవడానికి బదులు, న్యూనతా భావన బాధితులు, తమ ఆత్మ గౌరవాన్ని (self esteem)ను కాపాడు కోవడానికి, అతిగా ప్రయత్నిస్తారు. ఈ అతి ప్రయత్నంలో నష్టపరిహారం, కావాల్సిన దానికంటె ఎక్కువగా లభించవచ్చు. అలాంటప్పుడు న్యూనతా భావనతో సతమతమయ్యే ఒక పిల్లవాడు, అతి ప్రయత్నంతో మంచి కార్యశూరుడు కావచ్చు. కంటి చూపు అంతగా లేని ఒక అమ్మాయి, గొప్ప చిత్రకారిణి కావచ్చు. నత్తితో బాధితుడైన డెమోస్తనీజ్ గులకరాళ్ళు నోట్లో ఉంచుకొని సముద్రపు అలలకు ఉపన్యాసాలిచ్చి, ప్రపంచంలో మహా వక్త అయిపోయాడు. అలాగే జూలియస్ సీజర్, అలెగ్జాండర్, థియోడోర్ రూజ్వెల్ట్‌లు తమతమ శారీరక లోపాలను అధిగమించి ప్రపంచ చరిత్రలోనే మహా నాయకులయ్యారు.

ప్రతి ఒక్కనికి ఒక లక్ష్యం ఉంటుంది. ఆలక్ష్యం ఆధిక్యం. ప్రతివాడు తాను అధికుడు కావాలని కోరుకొంటాడు. దీనిని సాధించడానికి అతడు ఒక పద్ధతిని అవలంబిస్తాడు. ఈ పద్ధతిని అతని 'జీవన శైలి' (life style) అంటారు. ఆటల్లో గొప్పవాడు కావాలనుకొనే వాని జీవన శైలి, చదువులో పైకి పోవాలనుకొనే వాని జీవనశైలికంటె భిన్నం. వీరిద్దరు ఏ పని చేసినా, తమ తమ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొనే చేస్తారు. వారి ప్రవర్తన వారి జీవనశైలి ననుసరించే ఉంటుంది. ఈ జీవనశైలిని నిర్ణయించేది ఎవరు? తనకున్న ఒక ప్రత్యేక న్యూనతను పూడ్చుకొని, అధిక నష్టపరిహారం కోసం చేసే ప్రయత్నం.

మానవ మూర్తి మత్వ సారం 'సృజనాత్మక ఆత్మ' (creative self) అంటాడు ఆడ్లర్. ప్రతి వ్యక్తి తన మూర్తిమత్వాన్ని తనకు దత్తమైన అనువంశికత నుంచి, పరిసరం నుంచి తన ప్రత్యేక పద్ధతిలో నిర్మించుకొంటాడు. ప్రతి వాడు ఒక లక్ష్యాన్ని, దానిని చేరే ఒక పద్ధతిని ఏర్పాటు చేసుకొంటాడు. మనోవైజ్ఞానిక ప్రక్రియలు మొత్తం వ్యక్తిలో ఒక సుసంగతమైన వ్యవస్థను రూపొందిస్తాయి. ఇదే మూర్తిమత్వం. ఈ మూర్తిమత్వం ఆ వ్యక్తి ప్రత్యేకశైలిలో అభివ్యక్తమవుతుంది.

కారల్ గూస్టాఫ్ యూంగ్ అచేతనం విషయంలో ఫ్రాయిడ్‌తో విభేదించాడు. ఒక మనిషిలో ఉండే వైయక్తిక అచేతనం కాక, ఉమ్మడి అచేతనం (collective unconscious) గూడ ఉంటుం దంటాడు. ఈ ఉమ్మడి అచేతనంలో మానవ జాతి పుట్టినప్పటి నుంచి నేటి వరకు అనుభవించిన అనుభవాలు, సంస్కారాలు, ఉంటాయంటాడితడు. ఇంకా సార్వత్రిక స్మృతులు గూడ ఉంటాయి.

అతడు ప్రపంచ పురాణాలను, జానపద సాహిత్యాన్ని బాగా చదివాడు. వీటిల్లో ఆయనకు ఒకే విధంగా ఉన్న, పునరుక్తమైన, అనేక ప్రతిమలు కనిపించాయి. ప్రాచ్యమతాలలో కనిపించే మండలాలు (magic circles) లాంటివి, పేదరాసి పెద్దమ్మ, మాయల మరాటి, మంత్రకత్తె, జ్ఞాని లాంటి ప్రతిమలు ప్రపంచంలోని అన్ని పురాణాలలోను కనిపించాయి. వీటిని అతడు మూలరూపాలు (arche types) అన్నాడు. మరో రెండు మూల రూపాలు గూడ ఉన్నాయి. ఒకటి ముసుగు (Persons) ఇది పైకి కనిపించే మూర్తి మత్వం అంటే సమాజం ఒకని నుంచి ఆశించే మూర్తిమాత్వం; రెండోది ఛాయ (shadow). ఈ మూల రూపం మానవ స్వభావంలోని జంతు పక్షాన్ని, ప్రాక్చారిత్రక అడవి మృగాల వలని భీ తిని ప్రతిబింబిస్తుంది.

మరో రెండు ముఖ్యమైన మూల రూపాలు మగ, ఆడ వారికి సంబంధి ంచినవి. ఫ్రాయిడ్‌లాగా యూంగ్ కూడ మనిషిని మనోవైజ్ఞానికంగా ద్విలైంగికునిగా వర్ణించాడు. అంటే ఆడ, మగ ఇద్దరిలోను పురుష, స్త్రీ లక్షణాలు రెండు ఉంటాయి. 'యానిమ' అనేది పురుషులలో ఉండే స్త్రీ లక్షణాన్ని, యానిమస్ అనే మూల రూపం స్త్రీలలో ఉండే పురుష అంశను ప్రతిబింబిస్తుంది. ఒక స్త్రీని పురుషుడు తనలో ఉన్న యానిమ కారణంగా అర్థం చేసుకొంటాడు. ఒక పురుషుని, స్త్రీ తనలో ఉన్న యానిమస్ అంటే పురుష లక్షణం ద్వారా అర్థం చేసుకొంటుంది. స్త్రీ పురుషులలో ఎవరైన, రెండో వారి మీదకు ఆదర్శీ కృత మూల రూపాన్ని సారిస్తే, చాల సమస్యలు ఎదురవుతాయి.

యూంగ్ పేరు చెప్పగానే మనకు గుర్తుకొచ్చేవి అంతర్ముఖుడు (introvert), బహిర్ముఖుడు (extrovert). ప్రాథమికంగా ఈ రెండు ప్రాతిపదికల మీదనే మూర్తిమత్వం రూపు దిద్దుకొంటుంది. అంతర్ముఖుడు ఎప్పుడు తన లోపలికే చూసుకొంటాడు. బిడియం బిడియంగా, సిగ్గుగా, పిరికిగా, ఆలోచనా పరుడుగా ఉంటాడు. దీనికి వ్యతిరేకంగా ఉంటాడు బహిర్ముఖుడు. ఇతడు ఎప్పుడూ ఏదో హడావుడి చేస్తుంటాడు. పదిమందితో కలసి మెలసి, శక్తివంతంగా, తన అభిప్రాయాలను గట్టిగా చెబుతూ ఉంటాడు. మామూలు మనిషి ఈ రెండింటి మధ్య సమతూకాన్ని పాటిస్తాడు.

ఫ్రాయిడ్‌కు చుక్కెదురు జె.బి. వాట్సన్. ఫ్రాయిడ్స్ సహజాతాలు అచేతన ప్రేరణల గురించి మాటాడుతుంటే, ఆ భావనలు అస్పష్టాలని, అశాస్త్రీయాలనీ, వాట్సన్ గేలి చేశాడు. మూర్తిమత్వం, దానితో పాటు మూర్తిమత్వంలోని ఘర్షణలు, భయాలు, అలవాట్లు అన్నీ నిబద్ధ ప్రతిస్పందనల ద్వారా అంటే, conditioned responses ద్వారా వస్తాయని ఇతడు చెప్పాడు. అంటే అభ్యసనం - నేర్చుకోవడం - ద్వారా వచ్చాయని తాత్పర్యం.

ప్రవర్తన వాదుల్లో అత్యంతగా ప్రసిద్ధుడైన వాడు అమెరికాకు చెందిన బి. యఫ్. స్కినర్. ఇతడు వాట్సన్‌నూ, ఫ్రాయిడ్‌నూ ఇద్దరినీ విమర్శించాడు. ప్రవర్తన అనేది మనం ఊహించగల కారకాలతో నియంత్రిత మవుతుందని ఫ్రాయిడ్ చెప్పిన విషయాన్ని అంగీకరిస్తూనే, అతడు ప్రతిపాదించిన ప్రాక్కల్పనలను - అచేతనం, సహజాతాలు, దమనం లాంటి ప్రాక్కల్పనలను స్కినర్ ఒప్పుకోలేదు. అభ్యసన ముఖ్య రూపం ప్రామాణిక నిబంధనం classical conditioning. అనే వాట్సన్ ప్రతిపాదననూ ఇతడు అంగీకరించ లేదు. అభ్యసనం జరగడానికి ఇదొక్కటే ముఖ్య విధానం కాదనీ,

ఇతడు పరికరాత్మక నిబంధనానికి చోటు కల్పించాడు. ఇతడు కేవలం మూర్తిమత్వ సిద్ధాంతాలను ప్రతిపాదించడం కోసం కాక, అసలు ప్రవర్తన సార్వత్రిక నియమాలను కనుక్కోవడానికి ప్రయత్నించాడు. ఇతని దృష్టిలో మూర్తిమత్వం అంటే, ప్రవర్తన నమూనాలు.

నీవు ఏమిగా మారతావో, ఏమి అవుతావో అదే నీవు. Your are what you become అంటుంది మానవ వాద సంప్రదాయం. ఒక వ్యక్తి ఏమి చెప్పాడు, లేదా ఏమి చేశాడు అనే దానిని, బయటి నుంచి చూసి అతని మూర్తిమత్వాన్ని తెలుసుకోవడం కాక, ''అతడి అనుభవం ఏమిటి? అతడు తనను గురించి తాను ఏమనుకొంటున్నాడు,'' అనేదాని మీద ఆధారపడి అతని మూర్తిమత్వాన్ని అంచనా వేయాలంటుంది మానవవాద సైకాలజీ.'' ఇప్పుడు - ఇక్కడ జరిగే దానిని వ్యక్తి ఎలా వ్యాఖ్యానిస్తున్నాడు, ఎలా అర్థం చేసుకొంటున్నాడు,'' అనే దానిని ఆ వ్యక్తి తన కోణం నుంచి చూడడం.

జంతువులనుంచి, మానవులను వేరుపరిచే మానవ సామర్థ్యాల ఎంపికలో స్వేచ్ఛ (freedom of choice), స్వేచ్ఛా సంకల్పం స్వయం నిర్దేశం (self direction) లాంటి సామర్థ్యాలు, ముఖ్యంగా నిర్వచిస్తాయి. మానవ వాద సైకాలజీ 1964లో ప్రారంభమైంది. నాయకులు అబ్రమాం మాస్లో, రొలొమో, కారల్ రోజర్స్‌కు ముందరి సైకాలజీలన్నీ మానవ స్వభావంలో ప్రేమ, సుఖం, సంతోషం, హర్షం, ఉన్నాయనే సంగతిని విస్మరించాయి. వీటికి సైకాలజీలో చోటు కల్పించాడు అబ్రహాం మాస్లో.

మాస్లో ప్రకారం మానవావసరాలు రెండురకాలు: అవి ప్రాథమికావసరాలు (needs) అధి అవసరాలు (mataneeds). ప్రాథమికావసరాలంటె, ఆకలి దప్పులు, లైంగికత లాంటి శారీరకావసరాలే కాక ప్రేమ, వాత్సల్యం, గౌరవ ప్రతిష్టలు, భద్రతావసరాలు గూడ. ఏ ప్రభుత్వమైనా తన ప్రజల శారీరక, ప్రాథమిక అవసరాలైన ఆకలి దప్పులు, రక్షణ సమకూర్చాలి. ఒకసారి ఈ జీవనాధార అవసరాలు తీరిన తరవాత అంతశక్తి మంతాలు కాని, అధి అవసరాలు - అందం, ఐక్యత, న్యాయం, మంచితనం లాంటివి కార్యరంగంలోకి వస్తాయి. మాస్లో వీటిని పెరుగుదల అవసరాలు growth needs అంటాడు. ఎందుకంటె వీటిని సంతృప్తి పరచుకోవడానికి వ్యక్తి జంతు స్థితిని దాటి పెరగాలి. తన ప్రాథమికావసరాలును తీర్చుకొని, అధి అవసరాలను పండించుకో లేని వ్యక్తి మానసికంగా కుంగిపోయి నిరాశ నిస్పృహ, పరాయి తనం, నిరాసక్తతలకు గురి కావచ్చు. మానవీయమైన దానినంతా అతడు నిరాకరించవచ్చు.

మాస్లో ఈ ప్రాథమిక, అధి అవసరాలను ఒక నిశ్రేణిలో అమర్చాడు. మొదటి మెట్టు మీద శారీరకావసరాలను, రెండో మెట్టు మీద భద్రత, మూడో దాని మీద ప్రేమ, నాలుగో దాని మీద గౌరవావసరాలను, అన్నింటికంటె పైన ఆత్మ యథార్థీకరణావసరాన్ని ఉంచుతాడు. ఆత్మ యథార్థీకరణం అంటే ఏమిటంటే, ఒకడు ఏమి కాగలడో అది కావడం. అంతిమంగా ఒక రచయిత తనతో తాను అవిరోధంగా ఉండాలంటే, అతడు రాయాలి. చిత్రకారుడు చిత్రించాలి.

ఆవిధంగా చూసుకొంటే మనలో ఎంతమందిమి అంతర్వైరుధ్యం లేకుండా- అంటే ఆత్మ యథార్థీకరణం చెంది - ఉండ గలుగుతున్నామో ప్రశ్నార్థకమే.

# ప్రప్రథమ నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత

# సల్లీప్రుడ్ హోమ్

## (1901వ సం. ప్రథమ నోబెల్ సాహిత్య పురస్కారోపన్యాసము)

మూలం : సి.డి. అఫ్ విర్సెన్, స్వీడిష అకాడమీ శాశ్వత కార్యదర్శి

అనువాదం: అనిపెద్ది వెంకటరమణరావు

అత్యంత ఆసక్తి రేకెత్తించిన భూరి విరాళం ఇవ్వాలని ఆల్‌ఫ్రెడ్ నోబెల్ నిర్ణయించినపుడు సబబుగానే ఆయన జీవితాంతం చేసిన కృషి ప్రకృతి అధ్యయనానికి, దానికి సంబంధించిన కొన్ని విజ్ఞాన శాస్త్రాలలో వెలువడే నవీన ఆవిష్కరణలకు బహూకరించడానికి మొగ్గు చూపింది. అలాగే, ఆయన సర్వ సమ భావ ఆకాంక్షలు ఆయనను శాంతి, జాతుల సౌభ్రాతృత్వ కాముకునిగా తీర్చిదిద్దాయి. ఆయన తన విల్లులో తనకు ప్రియమైన విజ్ఞానశాస్త్రాల తరువాతి స్థానంలోనయినప్పటికీ, సాహిత్యాన్ని కూడా చేర్చాడు.

బహుశః బహు సుందరమైనప్పటికీ బహు సుకుమారమైన, అత్యుత్తమ నాగరికతా కుసుమం ఇప్పుడు పటిష్ఠమైన వాస్తవ స్థలిపై వికసిస్తుందన్న బలమైన కారణం మూలాన స్వీడన్ దేశపు బహుమతుల పరంపరలో చివరగా ఉన్నదని ఎవరైనా వాదించినప్పటికీ సాహిత్య ఉపాసకులు కూడా ఆయన వ్యాకులతకు కారకులైనందున సాహిత్యం ఆయనకు కృతజ్ఞయై ఉంది.

ఏమైనప్పటికీ, సాహితీవేత్తలు భౌతిక విలువల నధిగమించే ప్రతిఫలంగా గత కాలపు సువర్ణ ప్రసూనాలను ఈ ఆధునిక యుగపు పుష్పాంజలులలో గ్రహిస్తారు.

సాహిత్యానికి నోబెల్ బహుమతి ప్రదానం చేయడంలో కూడా దానికుండే సమస్యలు దానికున్నాయి. ''సాహిత్యం'' ఒక బహు అంతర్లీన పదం. నోబెల్ ఫౌండేషన్ నియమావళిలో కేవలం సుందర పదజాలమే గాక, వాటి రీతి, వ్యాఖ్యానముల ద్వారా సాహిత్య విలువలుగల రచనలు కూడా పోటీలో చేర్చబడాలని సరిగానే పేర్కొనడం జరిగింది. కాగా దీని పరిధి విస్తృతమయింది - కష్టాలు అధికమయ్యాయి. ప్రతి పాదిత గ్రంథకర్తల ప్రతిభలు సుమారుగా సరిసమానంగా ఉంటాయనుకోండి, వారిలో గీతాకారునికా, కావ్యకర్తకా, నాటక రచయితకా, ఎవరిని నిర్ణయించాలన్న మీ మాంస కష్టతరమైనది. ఒక ప్రసిద్ధ చరిత్రకారుడు, ఒక తత్వజ్ఞుడు మరియు మేధావి అయిన ఒక పండితుడు - వీరిలో నుండి ఎంపిక జరగాలంటే ఈ ప్రక్రియ మరింత జటిలమవుతుంది. గణితజ్ఞులు పేర్కొన్నట్లు పరిమాణాలు అను రూపముగా తయారవుతాయి. అయితే ఈ బహుమతి వార్షికం కావడం మూలాన, ఒక ప్రతిభావంతుడైన రచయిత అదే ప్రతిభగల మరొక రచయితతో పోటీ పడి వీగి పోయినా, అలాంటి

---

అనిపెద్ది వెంకటరమణరావు, దక్షిణ మధ్య రైల్వేలో ప్రజా సంబంధాల అధికారిగా పదవీ విరమణ చేశారు. సూర్య శక్తి మాసపత్రిక సంపాదక వర్గ సభ్యులు, హైదరాబాదు.

ప్రతిభావంతులు తమ ప్రతిభకు దీటైన బహుమానాన్ని మరొక సంవత్సరంలోనైనా అందుకోగలరన్న ఊరట కలిగించవచ్చు.

స్వీడిష్ అకాడమికి ఈ సాహిత్య బహుమానం కోసం మహత్తరమైన సిఫారసులు అనేకం అందాయి. వాటిని అత్యంత క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట, విశ్వవిఖ్యాతమైన మరియు సమాన సాహిత్య ప్రతిభగల పేర్ల నుంచి ఎంపిక చేయడంలో, అనేక దృక్కోణాల నుంచి పరిశీలించి ఈసారి ప్రాధాన్యత ఇవ్వాలని తాను విశ్వసించిన పేరును ఎంపికచేయడం జరిగింది. ఈ అకాడమీ ఆవిధంగా సాహిత్యంలో ప్రథమ నోబెల్ బహుమతిని ఫ్రెంచి అకాడమీకి చెందిన కవి, తత్వజ్ఞుడు అయిన సల్లీ ప్రుడ్ హోమ్ (Sully Prudhomme) కు ప్రధానం చేయడం జరిగింది.

సల్లీ ప్రుడ్ హోమ్ 1839, మార్చి 16న జన్మించి, 1865లో 'పద కవితలు, పద్యాలు' (Stanes et Poems) రచించడంలో ప్రతిభనార్జించారు. ఈ సంపుటం తరువాత అనేక కవితా, తాత్విక, రసాత్మక రచనలు వెలువరించాడు. ఇతర కవుల కల్పనలు ప్రధానంగా బాహ్యాదిశలో పయనిస్తూ మన చుట్టూ ఉండే ప్రపంచాన్ని ప్రతిబింబిస్తూ ఉండగా, సల్లీ ప్రుడ్‌హోమ్ రచనలు సున్నితమైన, మృదువైన అంతర్ముఖ లక్షణాలు కలిగి ఉన్నాయి. ఆయన కవిత్వంలోని ప్రతిబింబాలు బాహ్య స్థితులను యథాతథంగా చిత్రించడం అరుదైనా, కవిత్వ ఆలోచనలకు దర్పణం వలె ఉపయోగపడేటంత వరకు వాటి వినియోగం జరిగింది. ఆత్మీయ ప్రేమ, భౌతికంగా నివృత్తికాని ఆయన సందేహాలు, ఆయన విచారములు, సాధారణంగా ఆయన రచనలకు వస్తువులు కాగా వాటి సంపూర్ణ రూపంలోను మరియు శిల్ప సౌందర్యంలోను నిష్ప్రయోజనమైన పదం ఒక్కటీ ఉండదు. ఆయన కవిత్వం కాంతులీనే వర్ణములలో అగుపిస్తూ అరుదుగా మాత్రమే శ్రవణానందకర సంగీత లక్షణాలు సంతరించుకొని ఉంటుంది. కాని చిత్తవృత్తికి, భావ ప్రకటనకు తగిన రూప నిర్ణయంలో అది ఎక్కువగా సారూప్యంగానే ఉంటుంది. గంభీర చింతాక్రాంతుడుగా ఉండి, దుఃఖంవైపు మరలిన నోబెల్ ఆత్మ ఈ కవిత్వంలో బహిర్గత మవుతుంది. అది సుకుమారమైనప్పటికీ భావగర్భితం కాదు - పాఠకునిలో వ్యాకులమైన అర్ద్రత ప్రేరేపించే ఒక ఖేదపూరిత విశ్లేషణ.

తన అపురూప శైలి ఆకర్షణ ద్వారా మరియు తన అపురూప కళా నైపుణ్యం ద్వారా సల్లీప్రుడ్ హోమ్ మన కాలపు ఉత్కృష్ట కవులలో ఒకరుకాగా ఆయన కవితలు కొన్ని వినాశరహిత విలువలుగల మంచి ముత్యాలు. భావోద్రేకంతోను, మనోలగ్నంతోను నిండి ఉన్న సౌశీల్యము, హుందాతనము, మరియు సున్నితమైన వ్యక్తీకరణ సంపన్న భావనా సౌందర్యము కలిగిన ఆయన చిరుగేయ రచనల కంటే, ఆయన నీతి బోధక లేదా అవాస్తవిక రచనలు స్వీడిష్ అకాడమీని తక్కువగా ఆకట్టుకున్నాయి.

చివరగా ఒక విశిష్ట లక్షణం గురించి పేర్కొనడం అవసరం. సల్లీ ప్రుడ్‌హోమ్ రచనలు వర్తమానంపై అవిశ్రాంతత, నైతిక పరిధిలో, అంతకన్నా తెలుసుకునే సాధ్యంకానిదిగా కనిపించే మనుష్యుని సహజాతీత విధిలిఖిత సాక్ష్యాధారాన్ని ఆత్మగొంతులో మరియు త్రోసిపుచ్చలేని ఉదాత్త విధి నియమాలలో కనుగొనే

ఒక అన్వేషణాత్మక, పరిశీలనాత్మక మనస్సును బహిర్గతం చేస్తాయి. ఈ కోణం నుంచి చూస్తే అనేక ఇతర రచయితలకన్నా మిన్నగా ఒక టెస్టేటరు పేర్కొన్నట్లు సాహిత్యంలో ''ఒక ఆదర్శ పూర్వక వైఖరి''కి ప్రతినిధిగా నిలిచాడు సల్లీ ప్రుడ్‌హోమ్. ఈవిధంగా నోబెల్‌విల్లులోని స్ఫూర్తికి అనుగుణంగా ప్రవర్తిస్తున్నామని నమ్మి, ప్రప్రథమంగా బహుమతిని అనేక నిష్ణాతులైన రచయితల నుండి ఎంపిక చేసిన సల్లీ ప్రుడ్‌హోమ్‌కు ఈ బహుమతిని ఇవ్వడానికి అంగీకరించి ప్రధానం చేసింది అకాడమీ.

ఈ సాహితీ మూర్తి ఈ గౌరవాన్నందుకోడానికి అంగీకరించారు. అయితే అస్వస్థత కారణంగా మన మధ్యకు రాలేక పోయినందుకు ఈ పురస్కారాన్ని అందుకోవలసినదిగా ఫ్రాన్స్ మంత్రివర్యులను (Minister of France) కోరుతూ దీనిని స్వీడిష్ అకాడమీ తరఫున సల్లీ ప్రుడ్ హోమ్‌కు బహూకరించవలసిందిగా అర్థిస్తున్నాను.

**జీవితచరిత్ర :**

రెనె ఫ్రాంకోస్ ఆర్మండ్ ప్రుడ్ హోమ్ (1839-1907) (Rene Francois Armand Prudhomme) ఒక ఫ్రెంచి దుకాణదారుని కుమారుడు. తాను ఒక ఇంజనీర్‌కావాలని అనుకున్నాడుకాని ఒకానొక నేత్ర వ్యాధి మూలాన పోలీటెక్నిక్ ఇన్స్టిట్యూట్‌లో ట్రయినింగు అవుతూనే ఆ చదువు ఆపివేయవలసి వచ్చింది. సాహిత్యం అధ్యయనం చేసాడు. పిమ్మట పరిశ్రమలో కొంత కాలం పనిచేసి అది కలిసిరాక, ఆ తరువాత, అంత నమ్మకం లేక పోయినా న్యాయవాద వృత్తిని చేపట్టి ఒక సోలిసిటర్ కార్యాలయంలో పనిచేసాడు. ''కాన్ఫరెన్స్ లా బ్రుయెర్'' (Conference La Bruyere) అనే ఒక ప్రముఖ విద్యార్థి సంఘ సభ్యుడయ్యాడు. ఆ సంఘ సభ్యులు తన యువశక్తికి ఇచ్చినగౌరవం ఆయనను కవిత్వ రచనకు పురికొల్పింది. ఆయన ప్రథమ సంపుటి Stances et Poemes (1865) ను సెయింట్ - బ్యూవ్ సమీక్ష చేయడంతో ప్రుడ్‌హోమ్ ప్రతిష్ట స్థిరపడింది. అధ్యాత్మిక మరియు శాస్త్ర జిజ్ఞాసతో నిర్దుష్టత్వానికి, సౌందర్యానికి పర్నాషియన్ విధానాన్ని జోడించాడు సల్లీ ప్రుడ్‌హోమ్. ఉదాహరణకు ఈ ప్రక్రియలు క్రేటి యస్ రచన డి రిరం నేచురా (1878-79) (D. Rerum Natura) అనే ప్రథమ అనువాదంలో ప్రస్ఫుటమయింది.

ప్రుడ్‌హోమ్ ఇతర కవిత్వ రచనలు : Croquis Italiens (1866-68); Solitudes (1869); Impressions de la guerre (1870); Las Destins (1872) La Revolte des fleurs (1872); La France (1874); Les Vaines Tendresses (1875); La Justice (1878) మరియు La Bonheur (1888). 1908లో ప్రుడ్‌హోమ్ రచించిన కవితా సంకలనం ఆయన మరణానంతరం వెలువడింది. సేకరించిన ఆయన రచనలతో కూడిన అయిదు సంపుటాలు 1900-01లో వెలువడ్డాయి. ఆయన వ్యాసాలు, పాస్కల్‌పైన ఒక గ్రంథము (La Vraie Religion Selon Pascal - 1905) కూడా రచించాడు. సల్లీ ప్రుడ్ హోమ్ 1881 నుండి 1907లో మరణించే వరకు ఫ్రెంచి అకాడమీ సభ్యునిగా కొనసాగాడు.

# విజేతలు ఇలా ఉంటారు!

– సి. వి. సర్వేశ్వరశర్మ

జీవితంలో నెంబరు వన్ కావాలని ప్రతి ఒక్కరు అనుకుంటారు. కొంతమంది తమ కోరికను సాధించుకోగల్గుతారు. చాలామందికి కోరిక నెరవేరదు.

మన చుట్టూ వున్న సమాజంలో మనం అనేక మంది మనుషుల్ని చూస్తూ ఉంటాం. కొంత మందికి చిన్న అవకాశం ఇస్తే వారు దానిని ఆసరా చేసుకుని విశేషంగా ఎదిగి పోతారు. మరి కొంత మందికి ఎంత అవకాశం కల్పించినా వినియోగించు కోలేక మళ్ళీ మామూలు స్థితికి వస్తూ ఉంటారు.

జీవితంలో 'గెలుపు' అనేది ఒకగొప్ప అనుభూతి. దీనిని సాధించడం ఒక థ్రిల్. విజేత - పరాజిత ఇరువురుని నిశితంగా పరిశీలిస్తే మనకు ఎన్నో విశేషాలు తెలుస్తాయి. విజేతగా నిల్వాలంటే ఎటువంటి ప్రవర్తన కల్గిఉండాలనేది ఎవరికివారే గమనించగల్గుతారు.

**ఆత్మవిశ్వాసం**

ఏ పనినయినా సరే చేయగల ఆత్మవిశ్వాసం వీరిలో ఉంటుంది. తమకు సాధ్యంకాదని, అటువంటి పనితో తనకు పరిచయం లేదని ఎన్నడూ విజేతలు అనరు. ఎటువంటి కార్యమునైనా చేపట్టగల్గిన ధైర్యం వీరిలో ఉంటుంది.

మనిషికి ఆత్మవిశ్వాసం గొప్ప శక్తిని ప్రసాదిస్తుంది. ఆమొత్తం శక్తిని తాముచేసే పనిమీద ప్రయోగించడంతో విజయం సాధించగల్గుతారు. ఏ పనిని మొక్కుబడిగా చేయరు. చిత్తశుద్ధితో చేయడం వీరిలో ఉంటుంది.

మరొక ముఖ్య విషయం కూడా మనం తెలుసుకోవాలి. విజేతలు పని చేపట్టిన నిముషం నుండి వారి దృష్టి పని విజయవంతంగా పూర్తి చేయడం మీదనే ఉంటుంది తప్ప ఆపని వల్ల వచ్చే లాభాలు గురించి ఆలోచించరు. అందుకే తాము అనుకున్నది సాధిస్తారు.

ఏ పనినైనా విజయవంతంగా పూర్తి చేయగలమనే ఆత్మ విశ్వాసం మాత్రమే ఉంటుంది. ఏ మాత్రం గర్వం ఉండదు. జీవితం పై అవగాహన వీరికి ఎక్కువగా ఉంటుంది.

పుట్టుకతో వీరిలో ప్రతిభ పుట్టకపోవచ్చు. కాని పట్టుదలతో, నిరంతర కృషితో ప్రతిభావంతులుగా తయారవుతారు విజేతలు. 'కామన్‌సెన్సు' పుట్టుకతో వీరిలో ఏర్పడి ఉండకపోవచ్చు. తోటి వారిని చూసి తమలోని ఆలోచనా శక్తిని వికసింపజేసుకుని మంచి 'కామన్‌సెన్సు'తో వ్యవహరించడం నేర్చుకుంటారు. ఆపైన విజయసాధనకు ఉపయోగించుకుంటారు.

---

సి. వి. సర్వేశ్వర శర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్,
కృష్ణమూర్తి వీధి, అమలాపురం - 533 20, తూ॥గో॥జి॥ ఫోన్: 98856 - 232045

**విశ్లేషణ వీరి ఆయుధం**

విజేతలకు 'పనిచేయడం' ఒక వ్యసనంగా మారుతుంది. క్రమ శిక్షణతో ప్రణాళికపరంగా పనిచేయడం అలవాటు అవుతుంది. వీరిలో ఆశా వాదం ఉంటుంది. ముఖ్యంగా చొరవ, సాహసం వీరిలో అధికంగా ఉంటాయి.

చేపట్టిన ప్రతిపని విజయవంతంగా పూర్తవుతుందని వీరు ఆశించినా అన్నీ విజయవంతం కాకపోవచ్చు. 'విజయం' వరించలేదని కుంగిపోరు. తాము చేసిన పొరబాట్లు, ఇతరులు చేసిన తప్పులు విశ్లేషణ చేసుకుంటారు. ఆ తరువాత ఇటువంటి పొరబాట్లు దొర్లకుండా జాగ్రత్త పడతారు.

మొదటి ప్రయత్నాలలో చాలా మంది విజేతలు పరాజితలే. అనుభవాలను గొప్ప పాఠాలుగా తీసుకుని తమ లక్ష్యం వైపు దృష్టిని నిలిపి ఇబ్బందులు ఎదురయినప్పుడు వాటిని ఏ విధంగా ఎదుర్కొన వచ్చునో వ్యూహరచనలు చేసుకుని విజేతలుగా నిలుస్తారు.

ఆత్మ న్యూనతా భావం వీరి ఆలోచనలలోకి రాదు. తరచు పరాజయం ఎదురయితే ఆత్మన్యూనతా భావం వస్తుందని కొంతమంది అనుకోవచ్చు. కాని దృఢ సంకల్పం గల వీరు అపజయాలను ఖాతరు చేయరు. తమ నిరంతర ప్రయత్నాలు కొనసాగించి 'విజయాన్ని' పొందుతారు.

ఎన్ని ఇబ్బందులు ఎదురయినా తమ వ్యక్తిత్వంలో మార్పుకు అంగీకరించరు. తాము సాధించిన విజయాలకు సంతృప్తి చెంది ఆగక ఇంకా పలు విజయాల కోసం శ్రమిస్తూనే ఉంటారు.

**బాధ్యత తీసుకుంటారు**

ఏ పని విజేతలకు అప్పగించినా చాలా బాధ్యతగా తీసుకుంటారు. విజేతకు అప్పగించిన బాధ్యత గురించి ఇతరులు మరచి పోవచ్చు. ఇతరులను మెప్పించడం కోసం వీరు ఏ పని చెయ్యరు. ఏపనినైనా సమర్థవంతంగా చేయడం వీరి లక్షణం.

నిర్దేశించిన సమయం కన్నా ముందుగానే, అనుకున్న పనికంటే ఎక్కువగా పూర్తిచేయడం వీరి ప్రత్యేకత. విద్యార్థి దశలో ఇటువంటి లక్షణాలు అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. అటువంటి విద్యార్థులు ఇతర విద్యార్థులలో 'ప్రత్యేకత' పొంది వారి మనసుల్లో చిర స్థాయిగా నిలచి పోతారు.

ఉద్యోగస్థులయితే పై అధికారుల దృష్టిని ఆకర్షించి మరింత ఉన్నత స్థితికి వెళ్లగల్గుతారు. ఇలా సాధించడం కూడా 'విజయాన్ని' గెలుచుకున్నట్లే.

విజేతలు ఎప్పుడూ నిర్భయంగా ఉంటారు. 'నమ్మకం' వారి విజయ రహస్యం. భయం, ఆందోళన ఈ రెండింటిని దగ్గరకు రానియ్యరు.

**అందరిలో ఒకడు !**

అందరిలో ఒకడుగా ఉంటాడుగాని అందరిలో తానొక్కడే! అన్నట్లు విజేతలు ప్రవర్తించరు. తన ప్రత్యేకతను ప్రదర్శించకుండా సహచరులతో సమానంగా ఉంటూ అందరిని గౌరవిస్తూ తాను గౌరవం పొందుతాడు.

'విజేతలు' ప్రతి ఒక్క స్నేహితుని పేరుతో పిలవగల నైపుణ్యం అలవరచుకుంటారు. ఎవరిని విస్మరించరు. తృణీకార భావంతో ఎవరిని చూడరు. పైగా తాను చేస్తున్న పనిలో సహచరులందరికి భాగస్వామ్యం ఉందనే భావన కలుగ జేస్తూ ఉంటాడు.

ఉద్యోగి అయితే క్రిందిస్థాయి ఉద్యోగులనుకూడా ఆప్యాయంగా పలకరిస్తూ అందరి స్నేహాన్ని పొందగల్గుతూ ఉంటాడు. విజేత ఇతరులతో ఎంత బాగా కలసిపోయి ఉంటాడంటే అతను చెప్పిన 'మాట'ను ఎవరూ 'కాదు' అనరు.

అందుకే సులువుగా అందరి సహకారంతో తనకు అప్పగించిన పనిని పూర్తి చేయగల్గుతాడు.

**'సమయం' విలువ పెంచుతారు**

'సమయం' విలువను పెంచగల నైపుణ్యం వీరికి ఉంటుంది. ఏ సమయంలో ఏమి చేయ్యాలో అది ఖచ్చితంగా చేస్తారు. ప్రతి క్షణం వీరు సద్వినియోగం చేస్తారు. 'కాలం' తిరిగి రాదుకాబట్టి అందుబాటులో ఉన్న కాలాన్ని మరింత పదిలంగా వాడుకుంటారు.

వీరిలో ఒక ప్రత్యేకత ఉంటుంది. అదేమిటంటే 'తక్కువ సమయంలో ఎక్కువ పని చేయగల్గుతారు.' ఇదే సమయం విలువ పెంచడమంటే సోమరితనం వీరిలో ఎక్కడా కనబడదు.

చరిత్రలో నమోదయిన ఒకసంఘటన మనం చెప్పుకోవచ్చు. నెపోలియన్ కొంత మంది అధికారులను 'విందు'కు ఆహ్వానించాడు. అధికారులలో కొంతమంది విందుకు ఆలశ్యంగా వచ్చారు. 'సమయపాలన'గావించే నెపోలియన్ వచ్చిన వారితో విందు కార్యక్రమం' పూర్తి చేశాడు. ఆలశ్యంగా వచ్చిన వారిని 'చర్చా కార్యక్రమం' లో మాత్రమే పాల్గొన వలసిందిగా తెలియజేశాడు.

కాలాన్ని మీరు గుర్తిస్తే అదిమిమ్ములను గుర్తిస్తుంది. కాలాన్ని నిర్లక్ష్యం చేస్తే అది మీ జీవితాలను నిర్లక్ష్యం చేస్తుంది.

**విజేతలవ్వాలంటే ఏమిచేయాలి ?**

★ జీవితానికి ఒక లక్ష్యం నిర్దేశించుకోవాలి. ఆ లక్ష్య సాధనకు నిరంతర కృషి చేయాలి.

★ కావాలని ఎన్నడూ విశ్రాంతి తీసుకోకూడదు. నిద్రకు ఉపక్రమించకూడదు.

★ ప్రణాళికా బద్ధంగా, క్రమశిక్షణతో పనిచేయడం అలవరచుకోవాలి.

★ ఇతరులతో మాట్లాడేప్పుడు వారి కళ్లల్లోకి చూసిమాట్లాడండి. ఇది పరస్పర అవగాహనకు సహాయపడుతుంది. ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

★ ఇతరులతో నైపుణ్యంగా మాట్లాడడం అలవరచుకోవాలి. మాటలాడడం ఆత్మవిశ్వాసాన్ని పెంచే బలవర్ధక టానిక్.

★ నడవడికే కాదు నడక కూడా చురుగ్గా ఉండాలి. వేగంగా నడిచేవారిలో ఆత్మ విశ్వాసం ఎక్కువగా ఉంటుంది. అందుకని మీ నడక వేగాన్ని పెంచుకోండి.

★ సంకల్పం, అంకిత భావం, పట్టుదల, దీక్ష, వంటివి మీ సొంతంకావాలి.

★ సోమరితనానికి చోటు ఇవ్వకూడదు.

★ ధైర్య, సాహసాలతో ఉండడమే గాక నిజం చెప్పేందుకు వెనకాడకూడదు.

★ పరాజయాలు విజయాలకు పునాదులని భావించాలి.

★ అనుకున్న పనిని అనుకున్న సమయంలో చేయడం మీ అలవాటుగా మారాలి.

★ పదిమందితో హాయిగా కలసి మెలసి తిరగాలి. వారితో మనసారా నవ్వుకుంటూ ప్రయోజనకరమైన చర్చలు జరపాలి. ఇలా స్వేచ్ఛగా చర్చించడం వల్ల అవగాహన పెరిగి భయం పోతుంది. 'నిరాశ' దరిజేరదు.

★ ఎవరిని తృణీకార భావంతో చూడకూడదు. సమాజంలో ప్రతి ఒక్కరు ఏదోరకమైన శక్తి కల్గి ఉంటారు. వారి నుండి కొత్త కొత్త విషయాలు నేర్చుకునే తపన కల్గి ఉండాలి.

★ ఇతరులను ఆమోదించే లక్షణం, భరించే ధోరణి ఉండాలి.

★ పాజిటివ్ థింకింగ్ నేర్చుకోవాలి.

★ ఇతరుల మీద పెత్తనం చెలాయించే ప్రయత్నం చేయకూడదు.

★ పై అధికారుల వద్ద అతివినయం ప్రదర్శించకూడదు

★ ఇతరులను అనవసరంగా విమర్శించక వారికి ఆదర్శంగా ఉండాలి.

★ ఇతరులను గౌరవించడం ఆపైన ఇతరులచేత గౌరవింప బడడం జీవితంలో ఒక భాగం కావాలి.

★ చెదరని వ్యక్తిత్వం పోషించుకుంటే సమాజంలో గౌరవ స్థానం పొందడమే గాక ఏ పనినైనా విజయవంతంగా చేయగల్గుతారు.

★ పనిని వెతుక్కోవాలి. పని వెతుక్కుంటూ మన వద్దకు రాదు.

# చరిత్రకారునిగా కంభంపాటి సత్యనారాయణ

-టి. రవిచంద్

ఆధునిక ఆంధ్రదేశాన్ని అనేక ఉద్యమాలు ప్రభావితం చేశాయి. ఆంధ్ర ప్రజల జీవితాల్ని బహుముఖంగా ప్రభావితం చేసి దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం పాటుపడ్డ జాతీయోద్యమం; అంతకు పూర్వం సామాజిక సంస్కరణ కోసం కృషిచేసిన బ్రహ్మ సమాజం ఇంకా అనేక ఉద్యమాలు పేర్కొనదగినవి ఉన్నాయి. జాతీయోద్యమం దేశస్వాతంత్ర్య సముపార్జనే ప్రధాన లక్ష్యంగా పోరాటాలు నిర్వహిస్తే, సంఘ సంస్కరణోద్యమాలు సమాజంలోని మూఢ విశ్వాసాల నిర్మూలనకు పాటుపడ్డాయి. ఆధునిక యుగంలో ఈ రెండు ఉద్యమాలు ప్రజా జీవితంలో ఆధునిక భావాల వ్యాప్తికి దోహదపడ్డాయి. ఈ రెండు ఉద్యమాలలో ఆంధ్రదేశాన్ని, ఆంధ్ర ప్రజల సామాజిక జీవితాన్ని బలంగా ప్రభావితం చేసిన మరొక ప్రధాన ప్రజా ఉద్యమం - కమ్యూనిస్టు ఉద్యమం. 1917 సంవత్సరంలో లెనిన్ నాయకత్వాన రష్యాలో ఏర్పడ్డ బోల్షివిక్ విప్లవం ప్రపంచంలో తొలి కార్మికవర్గ ప్రభుత్వమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇది మార్క్స్, ఎంగెల్స్‌ల సిద్ధాంతాల ప్రభావంతో ఏర్పడ్డ అంతర్జాతీయ దృక్పథం గల కమ్యూనిస్టు పార్టీ సారథ్యంలోని తొలి ప్రజా ప్రభుత్వం.

అక్టోబరు సోషలిస్టు విప్లవం, దాని ప్రభావం ఒక రష్యాకే పరిమితమైనది కాదు. అది అంతర్జాతీయంగా అనేక దేశాల్ని సమూలంగా కదిలించింది. అక్టోబరు విప్లవం ప్రవచించిన భావాలు ప్రపంచంలోని అనేక దేశాలతో పాటు మన ప్రజల్ని, జాతీయోద్యమాన్ని ప్రభావితం చేశాయి. అందులో భాగంగా ఆంధ్రరాష్ట్రంలోని అన్ని వర్గాల, కులాల ప్రజలు, మేధావులు కమ్యూనిస్టు సిద్ధాంతాల ప్రభావానికి గురయ్యారు. ఆ ప్రభావ ఫలితమే ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ ( ఉద్యమం) ఆద్యులలో కంభంపాటి సత్యనారాయణ (1909-1983) ఒకరు. ఆంధ్రలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఆద్యులైన పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావుల సరసన నిలబడి ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి, మార్క్సిస్టు సిద్ధాంత ప్రచారానికి అవిరళ కృషి సల్పిన కంభంపాటి సత్యనారాయణ కేవలం విప్లవ రాజకీయ నాయకుడే కాదు. ఆయన మార్క్సిస్టు సిద్ధాంతవేత్త, చరిత్రకారుడు. అతి చిన్న వయసులోనే జాతీయోద్యమం వైపు ఆకర్షితులయిన ఆయన దేశ స్వాతంత్ర్యం కోసమే కాకుండా సమసమాజ నిర్మాణం కోసం పోరాటం చేస్తున్న కమ్యూనిస్టు ఉద్యమం వల్ల ప్రభావితులయ్యారు. ఆ విధంగా ఆయన ఆంధ్రరాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ ఆద్యులలో ఒకరిగా చరిత్రలో నిలిచిపోయారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ నేతగానే గాకుండా, మార్క్సిస్టు సిద్ధాంతవేత్తగా, వామపక్ష పత్రికల సంపాదకుడిగా, అనువాదకుడిగా, రచయితగా, పార్టీ శిక్షణా తరగతుల్లో అధ్యాపకుడిగా, చివరిగా 'చరిత్ర కలిగిన చరిత్రకారుడి'గా ప్రజల్లో, మేధావుల్లో ప్రసిద్ధి చెందారు.

ఆంధ్రలో కంభంపాటి సత్యనారాయణగారిని సీనియర్‌గారనే ఆప్యాయంగా, గౌరవంగా అందరూ పిలిచేవారు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ సంస్థాపక సభ్యుల్లో ఒకరయిన కంభంపాటి 'సీనియర్' అనే

టి. రవిచంద్, గుంటూరు.

పదానికి తగ్గ గొప్ప వ్యక్తిత్వం కలవారు. ఆయన సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జూలై 17వ తేదీ 1909లో తూర్పు గోదావరి జిల్లా దొడ్డవరంలో జన్మించారు. కాకినాడ, మద్రాసు (నేటి చెన్నై)లో విద్యాభ్యాసం చేసి 1935లో ఎం.ఎ. పట్టభద్రులయ్యారు. పది ఏండ్ల వయసులో గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం ద్వారా ఆయన రాజకీయ జీవితం ప్రారంభమయింది. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమం ఆయన తన చదువును సయితం మధ్యలో ఆపేసి జాతీయోద్యమంలో కార్యకర్తగా పనిచేసేట్లు పురికొల్పింది. కాకినాడలో 'రణ దుందుభి' అనే పత్రికను కొంతకాలం నడిపారు. 1931లో కరాచి కాంగ్రెసుకు ప్రతినిధిగా వెళ్ళారు. ఆ సమావేశంలోనే భగత్‌సింగ్ ఆయన అనుచరుల ఉరిశిక్షను ఖండిస్తూ గాంధీజీ ప్రవేశపెట్టిన తీర్మానం ఆ విప్లవ వీరులను అవమానపరిచే విధంగా ఉన్నదని కంభంపాటి భావించి, దానికి వ్యతిరేకంగా ఓటు చేసి సభ నుండి బయటకు వచ్చారు. ఈ సంఘటనతోనే కంభంపాటి విప్లవ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని చెప్పవచ్చు. ఆ తర్వాత ఆయన మద్రాసు చేరుకొని మీరట్ కుట్ర కేసులో ముద్దాయి అయిన అమీర్ హైదర్‌ఖాన్ నేతృత్వంలోని నిషేధిత కమ్యూనిస్టు పార్టీలో సభ్యులయ్యారు. జాతీయ కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలలో సభ్యుడిగా ఉంటూనే ఆయన 1932లో కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. 1937లో తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదే సమయంలో తుని కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. ఈ సమయంలోనే కంభంపాటి జీవితంలో మరిచిపోలేని ఒక సంఘటన జరిగింది. 1937లో మద్రాసు అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని బలపరుస్తూ, తుని జమీందారు దివానుగా పని చేస్తున్న తన తండ్రి నిలబెట్టిన అభ్యర్థికి వ్యతిరేకంగా ఎన్నికల్లో ప్రచారం చేశారు. ఈ సమయంలోనే తుని జమీందారుకి సంబంధించిన గూండాలు ఆయనపై దాడి జరిపారు. కంభంపాటి హరిపుర, త్రిపురలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు ప్రతినిధిగా హాజరయ్యారు. 1937, 1939 మధ్య కాలంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వారపత్రిక 'నవశక్తి' సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత 'ప్రజాశక్తి' సంపాదక వర్గంలో పని చేశారు. ఆయన కమ్యూనిస్టు పార్టీలో రాజకీయ కార్యకర్తగా క్రియాశీల పాత్ర పోషించినా, ఆయనకు తొలి నుండి ఆసక్తి ఉన్న రంగాలు - జర్నలిజం, గ్రంథ రచన, చరిత్ర పరిశోధనను విస్మరించలేదు. ఈ రంగాలలో ఆంధ్రలో కమ్యూనిస్టు నాయకులు ఎవరూ చేయని కృషి చేసి, భవిష్యత్తు తరాల మేధావికాసానికి దోహదం చేసే విలువైన రచనలు చేశారు. ఆయన పార్టీకి చెందిన అనేక పత్రికలలో ప్రధాన పాత్ర పోషించారు. తెలుగులో వామపక్ష జర్నలిజానికి ఉదాహరణప్రాయంగా నిలిచారు. అనేక మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాల్ని సృజనాత్మకంగా తెలుగులోకి అనువాదం చేశారు. వ్యూహాలు, ఎత్తుగడలతో తమనుతామే అభావం (Negate) చేసుకొంటున్న కమ్యూనిస్టు రాజకీయులకు, అభ్యుదయ మేధావులకు 'కమ్యూనిస్టు నీతి' (సంకలనం, అనువాదం)ని సృజనాత్మకంగా బోధించారు. 'సందేశం' (మార్క్సిస్టు సిద్ధాంత-రాజకీయ మాసపత్రిక) సంపాదకవర్గ సభ్యులుగా ఉంటూ, అత్యుత్తమ ప్రమాణాలతో ఆ పత్రికను నడిపారు. ఇంత చరిత్ర ఆయనకు ఉంది కాబట్టే డా॥ ఎమ్. పట్టాభిరామిరెడ్డి కంభంపాటి సత్యనారాయణను 'చరిత్ర కలిగిన చరిత్రకారుడి'గా అభివర్ణించారు.

నిజానికి చరిత్రకారుడిగా కంభంపాటి జీవితం 'సందేశం' పత్రికతోనే ప్రారంభమయిందని చెప్పవచ్చు. సంపాదకవర్గ సభ్యులుగా పత్రికను ఉత్తమ సైద్ధాంతిక స్థాయి గల పత్రికగా తీర్చిదిద్దడమే కాకుండా, ప్రాచీన తత్వశాస్త్రానికి, సమకాలిక చరిత్రకు సంబంధించి కొన్ని ప్రత్యేక సంచికలు వెలువరించడమే కాకుండా, కొన్ని సైద్ధాంతిక, చారిత్రక, తాత్విక సంబంధ వ్యాసాల్ని రచించారు. 'సందేశం' రెండు ప్రత్యేక సంచికలలో (1. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం-1857-58, 2. అద్వైత తాత్విక సంచిక-1958) చరిత్రకారుడిగా ఆధునిక భారత చరిత్రలో ప్రధాన ఘట్టమైన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంపై ఒక వ్యాసాన్ని, ప్రాచీన భారతీయ తాత్విక సిద్ధాంతమైన అద్వైత దర్శనంపై మరొక వ్యాసాన్ని రచించారు. ఆనాటికి ఆయనకున్న చారిత్రక దృష్టికోణంతో ఈ రెండు రచనలు చేశారు. ఆధునిక భారతదేశ చరిత్రలో తొలిసారి బ్రిటిష్‌సామ్రాజ్యవాదాన్ని గజగజ లాడించిన మహాసంగ్రామమే 1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటం. ఈ ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటంపై అటు బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు, ఇటు జాతీయోద్యమంలోని మితవాదులు, అతివాదులు ''పోరాట స్వభావం''పై నీచమైన దాడి చేశారు. ప్రజల్లో ఆ ప్రథమ భారత సంగ్రామంపై అనేక అపోహలు ప్రచారం చేశారు. ఇది కేవలం ''దేశభక్తి రహిత సిపాయీల పితూరి'' అని బ్రిటిష్ రచయితలు విమర్శించారు. అదే సమయంలో మార్క్స్, ఎంగెల్స్‌లు 1857-59లో భారతదేశంలో జరిగిన జాతీయ విముక్తి పోరాటంపై 'న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్'లో ఇది కేవలం సిపాయీల పితూరి కాదని ప్రథమ భారత సంగ్రామంగా విశ్లేషించి ప్రపంచ ప్రజలకు ఆ పోరాట స్వభావంపై ఉన్న అపోహల్ని పోగొట్టారు. వీటి ఆధారంతో, తన స్వీయ పరిశోధనతో 1857 'ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం: చారిత్రక ప్రాముఖ్యత' అనే వ్యాసంలో కంభంపాటి సత్యనారాయణ పోరాట స్వభావాన్ని గురించి, దాని వైఫల్యానికి కారణాల్ని గురించి అనుభవజ్ఞుడైన చరిత్రకారుడివలె గొప్పగా విశ్లేషించి చూపారు. ఈ వ్యాసం ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటంపై సమగ్ర పరిశీలనగా భావించవచ్చు. ముగింపుగా ఈ విప్లవ వైఫల్యాన్ని, ఓటమిని గురించి అన్న మాటలు పరిణతిచెందిన చరిత్రకారుడిగా కంభంపాటి సత్యనారాయణను ఆనాడే నిలబెట్టాయి. ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే చూడండి: ''ప్రపంచ చరిత్రలో అన్ని విప్లవాలు జయించలేదు. ఓడిపోయిన వాటిలో ప్రథమ భారత సంగ్రామం ఒకటి. అంతమాత్రం చేత దాని చారిత్రక ప్రాముఖ్యత తగ్గిపోదు. ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని కూలద్రోసేందుకు మొట్టమొదటిసారి దేశవ్యాపితంగా జరిగిన ఆ మహాసంగ్రామం భారత స్వాతంత్ర్యోద్యమానికి ఒక వెలుగుబాట.'' ఈ వ్యాస రచనలోనే ఎంతో ఉజ్వల భవిష్యత్తు, చరిత్ర సృష్టించగలిగిన అసాధారణ చరిత్రకారుడు దర్శనమిస్తాడు.

1958 'అద్వైత సంచిక'లో రాసిన మరొక వ్యాసం - 'శంకరుని కాలంనాటి దేశ పరిస్థితి: ఆయన ఉపదేశాల్లోని సాంఘిక ప్రయోజనం'. ఈ వ్యాసం అప్పటి ఆయన ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తుంది. దీనిలో క్రీ.శ. 8వ శతాబ్దంలో శంకరాచార్యుడు ఆనాటి చారిత్రక పరిస్థితులలో అభ్యుదయకర పాత్ర నిర్వహించాడని చూపించడానికి ప్రయత్నించారు. శంకరాచార్యుడు ఆనాటి పరిస్థితులలో చేసింది బ్రాహ్మణ మతోద్ధరణే! చివరి దశలో 'మనీషాపంచకం' రచించాడని, తాను ప్రబోధించే అద్వైతంలోని వైరుధ్యాల్ని గుర్తించాడని కొంతమంది చరిత్రకారులు చెబుతుంటారు.

ఇవన్నీ అభూతకల్పనలే. శంకరుడు తన 'బ్రహ్మసూత్ర భాష్యం'లో తీవ్రంగా ఖండించి, నిరసించింది ఈ దేశ చరిత్రలో అభ్యుదయకర పాత్ర నిర్వహించిన సాంఖ్య, బౌద్ధ, చార్వాక దర్శనాల్నే. శంకరుని కాలానికి ఇవి నైతికంగా దిగజారిపోయాయని అందువల్ల అవి ప్రగతి నిరోధకంగా తయారయి శాఖా భేదాలతో, మతవైషమ్యాలతో దేశ విచ్ఛిత్తికి కారణభూతమయ్యే తరుణంలో ఆయన తన ''సంస్కరణ పద్ధతి''తో ఆనాటి సామాజిక, తాత్త్వికపరిస్థితులలో ''సంస్కర్తగా అభ్యుదయ పాత్ర నిర్వహించా''డని చెప్పడం చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఈ వ్యాసంలో కంభంపాటి సత్యనారాయణ వ్యక్తీకరించిన అభిప్రాయాల్తో ఈనాడు మనం అంగీకరించలేకపోయినప్పటికీ, శంకరుని జీవితాన్ని, ఉపదేశాల్ని చారిత్రక నేపథ్యంలోనే అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినట్టు భావించవచ్చు. ఐతే ఈ చారిత్రక విశ్లేషణలో మధ్యయుగాల్లో శంకరాచార్యుడు నిర్వహించిన వైదికమత పునరుద్ధరణోద్యమాన్ని ఆయన నిశితంగా పరిశీలించలేదు. ఆధునిక యుగంలో శంకరాద్వైతానికి జాతీయంగానే కాదు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చి అద్వైతానికి ఆధునిక కాలంలో ప్రాణం పోసిన స్వామి వివేకానందుడు ప్రదర్శించిన విమర్శనాత్మక దృష్టిని కూడా చారిత్రక భౌతికవాదయిన కంభంపాటి సత్యనారాయణ ప్రదర్శించలేదు. శంకరాచార్యుడు తత్వశాస్త్ర పునరుజ్జీవనానికి అమోఘమైన కృషి చేశాడని, కుల భేదాల్ని పారమార్థిక స్థాయిలో నిరసించి, వ్యావహారిక జీవితంలో వాటిని పాటించవచ్చని చెప్పినట్లుగా కంభంపాటి అభిప్రాయపడ్డారు. అంతేకాదు. అహేతుకమైన పద్ధతిలో శంకరాచార్యుడ్ని సమర్థించడానికి కూడా ఆయన తన వ్యాసంలో ప్రయత్నించారు. ఆయన ఏమంటారంటే, ఆధునిక కాలంలో ఏ విప్లవ పార్టీ, ప్రజా సంస్థ, వర్ణవ్యవస్థను రూపుమాపడానికి ప్రయత్నించకుండా, ''మధ్యేమార్గం'' అనుసరిస్తుంటే, ఎప్పుడో ఎనిమిదో శతాబ్దిలో వర్ణ వ్యవస్థ యెడల ''ద్వంద్వవైఖరి'' శంకరాచార్యుడు ప్రదర్శించటంలో తప్పు లేదు! దీన్ని చారిత్రకంగా అహేతుక సమర్థనంగా భావించక తప్పదు. ఎందుకంటే శంకరాచార్యుడికి పూర్వమే బుద్ధుడి నుండి అశ్వఘోషుడి వరకు గల భారతీయ అవైదిక దార్శనికులంతా వర్ణవ్యవస్థను నిరసించి తీవ్రంగా ఖండించినవారే. క్రీ.శ. రెండవ శతాబ్దికి చెందిన మహాకవి అశ్వఘోషుడు 'వజ్రసూచి' (వర్ణవ్యవస్థ ఖండన) గ్రంథంలో ప్రాచీన యుగంలోని అమానుష, అశాస్త్రీయ, ఆధిపత్య సిద్ధాంతమైన వర్ణవ్యవస్థను తునాతునకలు చేశాడు. శంకరాచార్యుడి కంటే దాదాపు ఆరు వందల సంవత్సరాల ముందు జీవించిన అశ్వఘోషుడు వర్ణవ్యవస్థ పట్ల ఎటువంటి ''ద్వంద్వవైఖరి'' ప్రదర్శించకుండా ఖండిస్తే, శంకరాచార్యుడు ఎందుకు ఇటువంటి అవకాశవాద ''ద్వంద్వవైఖరి'' చూపించాడో నిశితంగా పరిశీలించవలసిన విషయం. ఆచరణలో వర్ణవ్యవస్థను రూపుమాపడానికి సాధ్యమయినా, కాకపోయినా, మానవ సమానతా సూత్రాల్ని అంగీకరించేవాళ్ళు, నాడయినా, నేడయినా వర్ణవ్యవస్థను, దాని ఆధిపత్య భావజాలాన్ని నీళ్ళు నమలకుండా స్పష్టంగా ఖండించాలి. అభ్యుదయ వాదులంగా చెప్పుకొనే మనమే కాదు, శంకరాద్వైతానికి ఆధునిక వ్యాఖ్యాతగా ప్రసిద్ధి చెందిన స్వామి వివేకానందుడు వర్ణవ్యవస్థ, బ్రాహ్మణాధిపత్యంపై శంకరాచార్యుడికి గల విశ్వాసాన్ని ప్రశ్నిస్తూ ఇలా అన్నారు: ''ఆదిశంకరుల బుద్ధి పదునైన కత్తిలాగ మిక్కిలి వాడి కలది. ఆయనగొప్ప పండితుడు. తార్కికుడు. దానిలో సందేహం లేదు. కాని ఆయనలో గొప్ప ఔదార్యం లేదు. ఆయన హృదయం కూడా అటువంటిదే. పైపెచ్చు బ్రాహ్మణత్వంలో ఆయనకు మితిమీరిన గర్వం. పరబ్రహ్మ జ్ఞానాన్ని బ్రాహ్మణేతరులు పొందలేరని,

తన వేదాంత సూత్ర భాష్యంలో ఎంతగా సమర్థించాడో. విదురుని విషయంలో, అతడు పూర్వ జన్మలో బ్రాహ్మణుడిగా ఉండటం వల్ల బ్రహ్మజ్ఞాని అయినాడని వాదించాడు. మంచిదే. ఈ రోజుల్లో శూద్రుడెవడైనా బ్రహ్మజ్ఞానాన్ని పొందితే, మీ శంకరుని పక్షం తీసుకొని అతడు క్రిందటి జన్మలో బ్రాహ్మణుడై పుట్టడం వల్ల బ్రహ్మజ్ఞానాన్ని పొందాడని చెప్పాలి? రామ! రామ! ('స్వామిశిష్య సంభాషణలు', స్వామి వివేకానంద, శ్రీరామకృష్ణమఠం, చెన్నై, 1996, పే. 101). చారిత్రక దృష్టితో చూస్తే క్రీ.శ. 8వ శతాబ్దంలో శంకరాచార్యుడు, ఆయన ఉపదేశాల వల్ల ఈ దేశానికి ఒనగూడిన సామాజిక ప్రయోజనం ఏమీ లేదని నిర్ద్వంద్వంగా ప్రకటించవచ్చు. ఒక విధంగా శంకరాచార్యుడి కంటే ఆయన పరమ గురువు గౌడపాదుడే నాటి పరిస్థితులలో బౌద్ధ, వేదాంత తాత్విక ధోరణుల మధ్య సమన్వయానికి ప్రయత్నించాడు. అద్వైతానికి ప్రథమాచార్యుడని బుద్ధుణ్ని గౌడపాదుడు సమన్వయ దృష్టితో ''ద్విపదాంవర'' అని గౌరవంతో సంబోధిస్తే, దాన్ని నారాయణరుషికి అన్వయిస్తాడు శంకరాచార్యుడు! ఇదీ ఆయన సంస్కరణ పద్ధతి. (చూడు: 'మాండూక్యోపనిషత్తు', మాండూక్య కారికా సంగ్రహం, గౌడపాదుడు, అనువాదం: త్యాగీశానందస్వామి, శ్రీరామకృష్ణమఠం, చెన్నై, 1982, పేజీలు: 42-43; 'ఎ హిస్టరి ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ', వాల్యూం: 1, సురేంద్రనాథ్ దాస్‌గుప్త, మోతీలాల్‌బనార్సిదాస్, న్యూఢిల్లీ, 1975, పేజీలు: 423-424). స్మారకోపన్యాసంలో కంభంపాటి చారిత్రక పరిశోధనలోని పరిమితుల్ని చూపించడం కొంచెం బాధగానే ఉన్నా, సామాజిక దృష్టితో ఆలోచిస్తే విమర్శ (గుణదోష విచారణ) ఈ విషయంలో అనివార్యమనిపించింది. ఎందుకంటే నేడు దేశంలో తలెత్తుతున్న కుల, మత ధోరణులకు కావాల్సిన తాత్వికబలం శంకరాద్వైతంలో పుష్కలంగా లభిస్తుంది. ప్రమాదకరమైన ఇటువంటి ప్రాచీన నిర్జీవ తాత్విక ధోరణుల పట్ల సకల ప్రగతిశీల శక్తులు అప్రమత్తమై ఉండాలి. బౌద్ధం, ఇతర అవైదిక తాత్విక ధోరణుల పట్ల కంభంపాటి ఆనాటికి లోతైన పరిశీలన చేయలేకపోయారని పిస్తుంది. ఐనా ఆయన చెప్పదలచుకొన్న విషయాల్ని స్పష్టంగా చెప్పారు. ఆమేరకు ఆయన అభినందనీయులు.

పరిశోధకుడిగా కంభంపాటి సత్యనారాయణ సాధించిన విజయాలు అనేకం. ముఖ్యంగా 1967 ప్రాంతాల్లో 'విశాలాంధ్ర', 'ఆంధ్రజ్యోతి' దినపత్రికల్లో రాసిన వ్యాసాలు ఆయన పరిశోధనాకౌశల్యానికి, ప్రతిభా పాటవాలకు తార్కాణం. కమ్యూనిస్టు ఉద్యమంలో సీనియర్‌గా, సిద్ధాంతవేత్తగా ఆయన గుర్తించబడ్డా; ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని కథల్ని వెలికితీసిన చారిత్రక పరిశోధకుడిగా తగినగుర్తింపు రాలేదనే చెప్పాలి. ''అర్ధశతాబ్ద కాలంలో ఆంధ్రుల పైన అక్టోబరు విప్లవ ప్రభావం'' గురించి వివిధ పత్రికలలో ఆయన రాసిన వ్యాసాలు సోవియట్ విప్లవ అభిమానులకే కాదు చరిత్ర పరిశోధకులకు, విద్యార్థులకు ఎంతో ఆసక్తిని కలిగిస్తాయి. ఈ వ్యాసాలు రాయడానికి కావాల్సిన సమాచారం సేకరించడానికి ఆయన ఎంతో శ్రమ చేశారని వాటిని చదువుతున్నప్పుడే మనం గ్రహించగలం. అక్టోబరు విప్లవ ప్రభావానికి గురయి తెలుగులో దాని గురించి రాసిన రచయితలెవరూ కమ్యూనిస్టులు కారని తెలుసుకున్నప్పుడు మనకెంతో ఆనందంతో పాటు, ఆసక్తిని కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 1917 నాటి అక్టోబరు విప్లవం కలిగించిన సంచలనం, ప్రభావం సామాన్యమైనవి కాదు. అదే సమయంలో ఆ విప్లవ వ్యతిరేకులు దానిపై చేసిన దుష్ప్రచారం తక్కువైందీ

కాదు. ఐనా ఆంధ్ర రాష్ట్రంలో కొంతమంది రచయితలు, మేధావులు స్వతంత్ర బుద్ధితో ఆలోచించి సోవియట్ విప్లవం, ఆ విప్లవ నేత లెనిన్ గురించి ఎన్నో వాస్తవాలు ప్రజలకందించారు. ఆ రోజుల్లో కమ్యూనిస్టేతరులు బోల్షివిక్ విప్లవాన్ని సమర్థిస్తూ రాయడం సాహసోపేతమైన పని. అటువంటి మహత్తర కార్యాన్ని నిర్వర్తించిన సుప్రసిద్ధ జాతీయ నాయకులు, జర్నలిస్టులున్నారు. వారు: భోగరాజు పట్టాభి సీతారామయ్య, ఉన్నవ లక్ష్మీ నారాయణ, జి.వి. కృష్ణారావు, దిగవల్లి శివరావు, నార్ల వెంకటేశ్వరరావు, గాంధీజీ శిష్యుడు, కాంగ్రెస్ చరిత్రకారుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య 1921లో 'ఆంధ్రపత్రిక' సంవత్సరాది సంచికలో 'సోవియట్టులు' అనే వ్యాసం రచించారు. బ్రిటిష్ వార్తాపత్రికల, సామ్రాజ్యవాదుల వ్యతిరేక ప్రచారాన్ని పట్టించుకోకుండా సోవియట్ సమాజాన్ని గురించి వాస్తవికమైన విషయాల్ని తెలుగు పాఠకులకు అందించిన తొలి వ్యాసం అది అంటే ఆశ్చర్యం కలిగించక మానదు. అలాగే జి.వి. కృష్ణారావు అనే జర్నలిస్టు 'నికొలాయ్ లెనిన్' అనే పుస్తకాన్ని ఇంగ్లీషులో 1921లో రచించారు. ఆయన టంగుటూరి ప్రకాశం పంతులు 'స్వరాజ్య' పత్రికకు సబ్-ఎడిటర్. ఆయన 'స్వరాజ్య' పత్రికా కార్యాలయానికి వచ్చే జాతీయ, అంతర్జాతీయ వార్తలను చదివి, వాటిని విశ్లేషించి ఈ గ్రంథ రచన చేశారు. దక్షిణ భారతదేశంలో లెనిన్‌పై వెలువడిన తొలి గ్రంథం ఇది. ఈ పుస్తకాన్ని గురించి చెబుతూ 'లెనిన్ ఇన్ ఇండియా' (న్యూ లిటరేచర్, న్యూఢిల్లీ, 1980) గ్రంథ రచయిత ఆనంద్ గుప్త ఇలా పేర్కొన్నారు: "Almost simultaneously in the south of the country Govindarajula Venkata Krishna Rao, a journalist, wrote a book in English entitled Nicolai Lenin: His Life and Works. His main objective, he said, was to present to my Indian brethren the noble life of the great Bolshevik leader of Russia' " (పేజీలు: 93-94). ఈ రచయిత జి.వి. కృష్ణారావు పూర్తి పేరు గోవిందరాజుల వెంకట కృష్ణారావు. ఆయన స్వస్థలం గుంటూరు. జి.వి. కృష్ణారావు ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత, బి.ఎ. ఆనర్స్ చదవడానికి కలకత్తా వెళ్ళి, సహాయ నిరాకరణోద్యమ సమయంలో గాంధీజీ పిలుపునందుకొని, చదువు మధ్యలో ఆపేసి, మద్రాసులోని 'స్వరాజ్య' పత్రికలో సబ్-ఎడిటర్‌గా చేరాడు. అలాగే గుంటూరుకు చెందిన మరో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, నవలా రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి' నవల సోవియట్ విప్లవ ప్రభావంతో శ్రామిక సమస్యలకు ప్రాధాన్యమిచ్చిన తొలి నవలగా అభివర్ణిస్తూ మరో వ్యాసం రాశారు. ఈ వ్యాసాల ద్వారా తెలుగు పాఠకులకు ఆయన ఒక వాస్తవాన్ని తెలిపారు. సోవియట్ అక్టోబరు విప్లవం అదేదో కమ్యూనిస్టులకు, కార్మిక వర్గానికి పరిమితమయిన విషయం కాదని, మానవాళి అభ్యుదయాన్ని కాంక్షించే వారందరి పైనా దాని ప్రభావం పడిందని ఆయన ఈ వ్యాసాల ద్వారా తెలియచేశారు. ఈ విధంగా కంభంపాటి సత్యనారాయణ విశేషమైన పరిశోధనతో కాలగర్భంలో కలిసిపోయిన అతి విలువైన విషయాల్ని ఆంధ్రులకు అందించారు.

కంభంపాటి రచనల్లో నాకు ఏర్పడిన తొలి పరిచయం 'అర్ధ శతాబ్ద కాలంలో ఆంధ్రుల పైన అక్టోబరు విప్లవ ప్రభావం' (వ్యాస సంకలనం). ఈ సంకలనంలో ఇప్పటికీ నేను మరచిపోలేని వ్యాసం - జి.వి. కృష్ణారావు పై రాసిన వ్యాసం. ఎందుకంటే అసలు భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడక

ముందే, తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గురించి, కమ్యూనిస్టేతరుడైన ఒక జర్నలిస్టు ఆ వ్యాసం రాయడం. ఆయన గుంటూరువాడు కావడం. ఈ రెండు విషయాలు నేను మరవలేనివి. అయితే ఇంకొక ఆసక్తికరమైన విషయం. ఇదే పేరుతో డా॥ జి. వి. కృష్ణారావు అని మరో మేధావి తెనాలిలో ఉండేవారు. ఆయన తెనాలి దగ్గర కూచిపూడిలో జన్మించారు. ఆయన తెలుగులో ప్రసిద్ధ నవలా రచయిత, బౌద్ధ పండితుడు, పరిశోధకుడు కూడా. ఆయన కూడా తొలి దశలో అక్టోబరు సోషలిస్టు విప్లవ ప్రభావానికి లోనయిన వాడే. అందువలన కంభంపాటి మదిలో మెదలగనే ఈ ఇద్దరు కృష్ణారావులు జ్ఞప్తికి వస్తారు.

కంభంపాటి సత్యనారాయణ పరిశోధనా వ్యాసాలలో చిరస్థాయిగా నిలిచిపోయే మరొక అమూల్యమైన వ్యాసం 1980 'మెయిన్ స్ట్రీమ్' ఆంగ్ల వారపత్రికలో - 'ఎ ఫర్‌గాటెన్ ఇంటలెక్చ్యువల్ ఆఫ్ ద సౌత్' (విస్మరించబడిన దక్షిణ భారత మేధావి) పేరుతో మరుగున పడ్డ తొలి మార్క్సిస్టు పరిశోధకుడు, సామ్రాజ్య వాద వ్యతిరేకి, తొలి భౌతికవాద గ్రంథ రచయిత, రాజీ ఎరుగని పోరాటయోధుడు, మనం అందరం అభిమానించి, గౌరవించే డా॥కె. బి. కృష్ణ (1906-1948) జీవిత, సాహిత్యాలపై విశేషమైన పరిశోధన చేసి రాశారు. అసాధారణమైన మేధా సంపత్తి కలిగి అనామకంగా మరణించిన డా॥కె. బి. కృష్ణగురించి, ఆయన మరణించిన మూడు దశాబ్దాలకయినా, యావత్తు భారతదేశంలో ఏ కమ్యూనిస్టు నాయకుడు, సిద్ధాంతవేత్త ప్రకటించని మేధా నివాళి - 'A Forgotten Intellectual of the South' (విస్మరించబడిన దక్షిణ భారత మేధావి) డా॥కె. బి. కృష్ణ గురించి మనం ఈ రోజు ఈ మాత్రమయినా మాట్లాడుకోగలుగుతున్నామంటే ఇద్దర్ని ఆంధ్రులు విస్మరించకూడదు. వారు: స్వాతంత్ర్య సమరయోధుడు దర్శి చెంచయ్య, కంభంపాటి సత్యనారాయణ. 1940-42 ప్రాంతాల్లో డా॥కె. బి. కృష్ణ వెల్లూరు జైల్లో డిటెన్యూగా ఉన్నారు. ఆ సమయంలో కంభంపాటి కూడా తోటి డిటెన్యూగా జైల్లో ఉన్నారు. అప్పుడే డా॥కె. బి. కృష్ణతో ఆయనకు పరిచయమయింది. రెండవ ప్రపంచ యుద్ధం ఫాసిస్టు వ్యతిరేక యుద్ధమని, కమ్యూనిస్టు పార్టీ ఒక నిర్ణయానికి రాకముందే డా॥కె. బి. కృష్ణ మారిన యుద్ధ స్వభావాన్ని గుర్తించి, తోటి కమ్యూనిస్టు డిటెన్యూలకు వివరించబోతే, వారి నుండి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్నారు. అలా వ్యతిరేకించిన వారిలో కంభంపాటి సత్యనారాయణ కూడా ఉన్నట్టు సుప్రసిద్ధ కమ్యూనిస్టు (మార్క్సిస్టు) నాయకుడు ఎ.కె. గోపాలన్ తమ స్వీయ చరిత్ర 'జ్ఞాపకాలు' లో రాశారు. కాని కంభంపాటి తమ 'స్వీయ చరిత్ర' లో డా॥కె. బి. కృష్ణ వాదనను బలపరిచిన వారిలో తానూ ఒకణ్ణని రాసుకున్నారు! తోటి కమ్యూనిస్టు డిటెన్యూల ప్రవర్తన ఆ సమయంలో డా॥ కె. బి. కృష్ణను మానసికంగా బాగా కృంగదీసింది. అప్పుడు ఏర్పడిన అంతరం (gap) డా॥కె. బి. కృష్ణ మరణించే వరకు కొనసాగింది. ఆ అంతరం అలా ఉండబట్టే డా॥కె. బి. కృష్ణ మరణించిన మూడు దశాబ్దాల వరకు ఎవరూ ఆయన రచనల్ని పట్టించుకోలేదు. 1980లో 'మెయిన్‌స్ట్రీమ్' లో రాసిన వ్యాసమయినా, కంభంపాటి ఆయనంతట ఆయన రాసింది కాదు. డా॥ ఎమ్. పట్టాభిరామిరెడ్డి అనే చరిత్రకారుడు చేసిన సూచనతో కంభంపాటి డా॥ కె. బి. కృష్ణపై ఈ వ్యాసం రాశారు. వెల్లూరు జైలులో కనుక తోటి కమ్యూనిస్టులు డా॥కె. బి. కృష్ణ వాదనను అవహేళన చేయకుండా, ఆలకించి ఉంటే, సున్నితమనస్కుడైన ఆ అసాధారణ మేధావికి ఇంత అన్యాయం జరిగి ఉండేది కాదు. ఆలస్యంగానయినా

కంభంపాటి డా॥కె. బి. కృష్ణకు జరిగిన అన్యాయాన్ని ఈ వ్యాసం ద్వారా సరిదిద్దగలిగారు. డా॥కె. బి. కృష్ణ రచనల్లో 'స్టడీస్ ఇన్ హిందూ మెటీరియలిజమ్' (1932), 'పొలిటికల్ అండ్ సోషల్ థాట్ ఆఫ్ బుద్ధిస్ట్ రైటర్స్' (1933) నేటికీ ఔచిత్యం కోల్పోనివి. డా॥కె. బి. కృష్ణ శతజయంతి (2006) నాటికయినా ఇంకా అముద్రితాలుగా ఉన్న ఆయన రచనల్ని వెలుగులోకి తేవాలి. కంభంపాటి ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ అగ్రనేతల్లో ఒకరయినా, పార్టీ పట్టించుకోని కొన్ని విషయాల్లో స్వతంత్రంగా ఆయనంతట ఆయనే కృషి చేశారు. ఆ స్వతంత్ర పరిశోధనలో భాగంగానే డా॥ కె. బి. కృష్ణపై 'మెయిన్‌స్ట్రీమ్' లో ఆయన వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో డా॥కె. బి. కృష్ణకు నివాళి అర్పిస్తూ అన్న మాటల్ని మీ దృష్టికి తెస్తున్నాను: ''డా॥ కె. బి. కృష్ణ సామాజిక ప్రగతికి అంకితమైన అత్యంత ప్రతిభావంతుడైన పరిశోధకుడు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన యోధుడు. శ్రామికవర్గం పట్ల అచంచల దీక్షాదక్షతలు గల మార్క్సిస్టు మేధావి. ఐతే తనకు అర్హమైన ఎట్టిగుర్తింపు పొందకుండానే, ఎట్టిగౌరవం, ప్రఖ్యాతి పొందకుండానే, అజ్ఞాతంగా, అసహాయంగా కనుమరుగైపోయిన భారత స్వాతంత్ర్య సమరయోధాగ్రణి'' (అనువాదం: పరకాల పట్టాభి రామారావు).

సందర్భం వచ్చింది కాబట్టి డా॥కె. బి. కృష్ణ జీవితానికి సంబంధించి మరొక ముఖ్యమైన విషయం చెప్పుకోవాలి. డా॥కె. బి. కృష్ణ కులవ్యతిరేక ప్రతిఘటనోద్యమాలపై 1933లోనే మార్క్సిస్టుగా పరిశోధన చేశారు. ఆ పరిశోధన ఆవశ్యకతను కమ్యూనిస్టు ఉద్యమం గుర్తించాల్సినంత స్థాయిలో గుర్తించలేదన్నది చారిత్రక యథార్థం. అందుచేతనే మహారాష్ట్ర సత్యశోధక్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు శరద్ పాటిల్, డా॥కె. బి. కృష్ణ కుల వ్యవస్థపై చేసిన పరిశోధనగురించి మాట్లాడుతూ, ఇప్పటికీ మార్క్సిస్టు పండితులు అంగీకరించడానికి ఇష్టపడని, భారతీయ సామాజిక వ్యవస్థలో కులం మౌలికమనే విషయాన్ని 1930 ప్రాంతాల్లోనే డా॥కె. బి. కృష్ణ గుర్తించడం చాలా ఆశ్చర్యకరమైన విషయంగా భావించారు. ఇటువంటి ఆలోచనాత్మకమైన విషయాలు డా॥ కె. బి. కృష్ణ పరిశోధనలో చాలా ఉన్నాయి. ఈ రోజు దళిత ఉద్యమం భారతదేశంలోని కుల సమస్య గురించి అనేక ప్రశ్నల్ని లేవనెత్తింది. ఆ ప్రశ్నల గురించి ఆలోచించాల్సిన బాధ్యత కమ్యూనిస్టు ఉద్యమం పై ఎంతయినా ఉంది. కాని వాటికి తగిన సమాధానం, పరిష్కారం సాంప్రదాయికంగా ఆలోచించే కమ్యూనిస్టుల దగ్గర లేదు. ఒక మార్క్సిస్టు మేధావిగా డా॥కె. బి. కృష్ణ కుల వ్యతిరేక పోరాటాలకు కావాల్సిన సైద్ధాంతిక వారసత్వాన్ని మన కందించారు. ఆ వారసత్వాన్ని దేశంలోని కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమం తనదిగా చేసుకొని; కుల, వర్గ వ్యతిరేక పోరాటాలకు చారిత్రకంగా అవసరమైన సైద్ధాంతిక అవగాహనను ఈ దేశ ప్రజలకు అందిస్తుందని ఆశిస్తున్నాను. మేము 1994లో ప్రచురించిన 'స్టడీస్ ఇన్ హిందూ మెటీరియలిజమ్' (హైందవ భౌతికవాదం - అధ్యయనాలు) కు వచ్చిన జాతీయ స్థాయి ప్రతిస్పందన చూసి మాకే ఆశ్చర్యం కలిగింది. జాతీయ స్థాయిలో నాస్తికులు, హేతువాదులు, మానవవాదులు, బౌద్ధులు, శరద్‌పాటిల్ వంటి కమ్యూనిస్టులు, స్వతంత్ర మేధావులు 1930లోనే మార్క్సిస్టుగా డా॥ కె. బి. కృష్ణ భారతీయ భౌతికవాదం, బౌద్ధాలపై చేసిన కృషిని కొనియాడారు. ఐతే రాష్ట్రంలోని ప్రగతిశీల సంస్థలు తమ సహజమైన మౌనాన్ని ప్రదర్శించాయి. ఈ సంస్థలకు సంబంధించిన కొంతమంది ఆలోచనాపరులు వ్యక్తులుగా మాకు మద్దతు ప్రకటించి, ప్రోత్సాహపరిచారు.

(సశేషం)

# చిత్రకారునిగా - హిట్లర్

-కాండ్రేగుల నాగేశ్వరరావు

నాజీ నియంత నరరూప రాక్షసుడయిన హిట్లర్ చిన్నతనంలో తాను ఒక ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారునిగా ఎదగాలని బంగారు కలలు కనేవాడు. సహజ సిద్ధంగా చక్కటి రేఖా విన్యాసం, చిత్రాలలో లోతు (Depth & Persective) చూపించగలిగిన ప్రజ్ఞ వున్నా మనుష్యులు, జంతువుల మూర్తులను వేసేటపుడు మాత్రం అవి అంత సహజంగా ఉండేవికావు. అంతర్గతంగా తనలో ఇమిడి వున్న సృజన సరియైన రూపాంతరం చెందాలంటే ఐరోపాలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వియన్నాలోని లలితకళా అకాడమీలో శిక్షణ పొందాలని ఆశించాడు. తన ప్రతిభపై వున్న నమ్మకంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. కానీ అకాడమీ కార్య నిర్వాహక సభ్యులు మాత్రం ''ఇతనికి చిత్ర కళలో మంచి అభిని వేశం ఉంది అయినప్పటికీ సృజనాత్మకత లోపించటము వలన ఇతను ప్రవేశానికి అర్హుడు కాడని'' ప్రకటించారు. జీవితంలో అతన్ని గాయపరచిన అనేకానేక సంఘటనలలో ఇది కూడా ఒకటి. నిజానికి అతను గొప్ప చిత్రకారుడు కాకపోయినా మంచి చిత్రకారుడు కాకుండా పోలేదు. ఆ మాటకొస్తే ఆధునిక చిత్రకళ మూల స్థంభాలలో ఒకడయిన సెజేన్ కూడా (Impressionist) చిత్రకళా కళాశాలలో ప్రవేశం నిరాకరించ బడినవాడే.

1908, 1912ల మధ్య బ్రతుకు తెరువు వెతుకు లాటలో తన్నుతాను పోషించు కోవడానికి ఒక వారానికి సుమారు మూడు పోస్టు కార్డు సైజుల చిత్రాలు గీసి చర్చిముందు నిలబడి వచ్చిపోయే (ముఖ్యంగా ఆస్ట్రియాలోని నగరాలు, రోడ్డు కూడళ్లు Water color చిత్రాలు). టూరిస్టులకు చిత్రాలను అమ్ముకుంటూ బ్రతుకు వెళ్ళ దీశాడు. 1933వ సంవత్సరంలో జర్మనీ నియంత అయ్యేంత వరకూ చిత్రాలు గీస్తూ వచ్చాడు. అతను జీవిత కాలంలో చిత్రించినవి మొత్తం 600 పై చిలుకు ఉండవచ్చని అంచనా. ఎక్కువ భాగం రేఖా చిత్రాలూ, వాటర్ కలర్స్‌తో వేసినవి. ఆనాటి ఆస్ట్రియా వీధులు, పరిసరాలు వాని ప్రక్కనున్న భవన నిర్మాణాలు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికన్ సైనికులు అతను వేసిన చిత్రాలను అందినంత మటుకు దొరకబుచ్చుకొని తమ దేశమైన అమెరికా వెళ్ళి అక్కడ వాటిని అమ్ముకున్నారు. ఇందులో కొన్ని చిత్రాల అమ్మకం-కొనుగోళ్లపై 2002 సంవత్సరము వరకూ అమెరికన్ ఫెడరల్ కోర్టులో కేసులు కూడా నడచాయి. అవి గొప్ప చిత్రాలు కావనీ, చరిత్రను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసిన ఒక నియంత చిత్రాలుగా మాత్రమే వాటికి విపరీత ధర పలుకుతుందని అమెరికాలో కొందరు కళా విమర్శకుల అభిప్రాయం. ఇది పూర్తిగా నిజం కాదు. నాజీ నియంతపై తమ అక్కసును వారావిధంగా తీర్చుకున్నారు.

చిత్రకళపై విపరీత అభిమానం గల హిట్లర్‌కు వాటిపై కొన్ని నిర్దిష్టమయిన ఏకీకృత అభిప్రాయాలున్నాయి. సెజేన్ (Cezzane) తరువాత వచ్చిన ఇంప్రెషనిస్టులపై అతనికి సదభిప్రాయం

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

లేదు. పికాసో, విన్సెంట్ వాన్గో చిత్రాలను అతను మెచ్చుకోలేక పోయాడు. డచ్చి చిత్రకారుడయిన వెర్మీర్ అతని కత్యంత ఇష్టుడు. పోలెండ్ను ఆక్రమించుకున్న తరువాత డచ్ దేశంపై జరిగిన దాడులలో వెర్మీర్ చిత్రాలను బలవంతాన జర్మనీకి తరలించే ప్రయత్నం చేశాడు. దానిని నిరోధించడానికి డచ్ దేశస్థులు చూపిన చొరవ, సహనంతో అతని ప్రయత్నాలు విఫలమయ్యాయి.

చిత్రకళపై వ్యాఖ్యానిస్తూ ''ప్రజలకు చేరువకాని, అర్థంకాని ఈ కళ నిష్ప్రయోజనం. అర్థం పర్థం లేని గీతలు, పొంతనలేని రంగులు వీరి అపరిపక్వత్వానికీ, మానసిక వ్యాధికీ చిహ్నాలు. చిత్రకళ కొన్ని శతాబ్దాలుగా అభివృద్ధి చెంది నేటి ఈ స్థాయికి చేర్చుకున్నది. వీళ్ళ మానాన వీళ్ళను వదిలేస్తే వీళ్ల దీనిని నవీన దృక్పథం పేరుతో చిత్రకళను వెనుకకు నడిపిస్తారు. ఈ అనాగరిక చిత్రాలు వేసేవాళ్ళు నా దృష్టిలో పరమ శుంఠలు. ఆరోగ్యవంతమైన సౌందర్య దృక్పథం కళకు ప్రాణం. ఇది తెలియక అమాయకంగా చేస్తున్నది కాదు, కావాలనే కళను అప్రభంశం చేసి కాలరాస్తున్నారు. కళపట్ల సరియైన దృక్పథం లేక ఏర్పడిన భావ దరిద్రాన్ని మనం కళగా చంపే హక్కు వీరికి లేదు. వీళ్ళందరినీ మానసిక రోగుల ఆసుపత్రిలోగాని, జైళ్ళలోగాని పెట్టాలి. కళయొక్క పవిత్రత మనం కాపాడాలి అదే మన జాతీయతను రక్షించుకోవాలి''

ఆధునిక కళపై అతనికున్న ఏహ్య భావం ఎంత వరకూ వెళ్ళిందంటే, జనవరి 1933వ సంవత్సరంలో అధికారానికి వచ్చిన వెంటనే గోబెల్స్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించి ఆధునిక చిత్రాలను ఒకచోట ప్రోగుజేసి ముఖ్యంగా డాడాయిజం, క్యూబిజం, ఫ్యూచరిజాలకు (Dadaism)(Cubism)(Futurism) చెందిన పాల్క్లీ, డిక్స్ మున్నగు వారి చిత్రాలను సేకరించి అందులో 250 చిత్రాలను ప్రజలముందు బెర్లిన్ నగర కూడలిలో భస్మీపటలం గావించాడు. కొంచం వ్యక్తావ్యక్తంగా ఉన్న చిత్రాలను మాత్రం తక్కువ ధరకు వేలం వేయించి ఆ డబ్బును మిలటరీ అవసరాలకు ఖర్చుచేశాడు.

తనను నిరాకరించిన వియన్నా లలితకళా అకాడమీ పరపతి తగ్గించడం కోసం వియన్నా ప్రక్కనే ఉన్న లింజ్ గ్రామాన్ని దత్తత తీసుకున్నాడు. దానిని ఐరోపాలో అతి ముఖ్యమయిన లలిత కళాకేంద్రంగా తీర్చి దిద్దాలన్న అతని కోరిక జర్మనీ పరాజయంతో అసంపూర్ణంగా మిగిలి పోయింది.

ఆనాటి రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ప్రముఖ దేశ నాయకులైన హిట్లర్, ఐసన్హోవర్, చర్చిల్ ఈ ముగ్గురూ చిత్ర కళపై విశేష అభిమానం ఉంటమే కాక స్వయంగా చిత్ర కారులు కావటం ఒక విశేషం. వీరి ముగ్గురులోనూ ఎక్కువ నైపుణ్యం గలవాడు హిట్లరే.

★ ★ ★ ★ ★

(మూడవ నాల్గవ అట్టలపై చిత్రించిన చిత్రకారుని గురించి)

## కాదేది శిల్పానికనర్హం

అగ్గిపుల్లా, సబ్బు బిళ్ళా కాదేది కవిత కనర్హమని శ్రీశ్రీ అంటే, కాదేది శిల్పానికనర్హమంటాడు బెల్జియం దేశస్థుడయి అమెరికాలో స్థిరపడ్డ అర్మాండ్ ఫెర్నాండజ్ (Armond Fernawdez). పారిస్

నగరంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన లలిత కళాశాల నుండి అత్యున్నత స్థాయిలో ఉత్తీర్ణుడయి డాడాయిజాన్ని ప్రోదిచేసిన వాళ్ళలో ముఖ్యుడు. బాల్యంలో తన తండ్రి కూడా ప్రపంచ తిరునాళ్ళను దర్శించినప్పుడు అక్కడ కనిపించే ప్రతి వస్తువు యొక్క అంతఃకరణ చూడాలనే జిజ్ఞాస కలిగింది. దీనికి తోడు ఒకనాడు తన మామ్మగారి ట్రంక్‌పెట్టె తెరచి చూసి దానినిండా చిందర వందరగా ఉన్న అనేక చిన్న చిన్న వస్తువులు అతనిలో ఒక Obsession ను పెంపొందించాయి. 1960వ దశకంలో, 32 ఏళ్ళ వయస్సులో ఎందుకూ పనికిరాని ఇనుప ముక్కలు, విరిగి పోయిన రంపాలు, కాఫీ కప్పులు, హార్మోనియం పెట్టెలు మొదలైనవి పోగుచేయటం, వాటినుంచి కళాకృతులు తయారు చేయటం మొదలు పెట్టాడు.

కోటేశ్వరుడయిన అతని మిత్రుడు జాన్‌హీమన్ పెట్టుబడిపెట్టి ప్రోత్సహించగా, ఆ మిత్రుడు వ్యవస్థాపకుడుగా ఉన్న (Monterl Park) మెంటెల్ పార్క్‌లోని కూడలిలో ఈ నవీన స్థూపాన్ని నిర్మించాడు. దీని ఎత్తు 64' అడుగులు. వెడల్పు ఏ వైపు చూసిన 20' అడుగులు. ఇందులో 59 కార్లను 13 దొంతరలుగా పేర్చి 1,600 టన్నుల కాంక్రీట్ ఉచ్చులో బిగించి, ఒక ఆధునిక హరివిల్లు లాంటి శిల్ప ప్రక్రియకు దోహదం చేసాడు. దీనిని ఆవిష్కరించిన తరువాత అర్మాన్ తాను పిరమిడ్‌లను బోలిన ఒక శిల్పానికి కృతికర్తకావటం తనను ఎంతో ఆనందింప జేసిందన్నాడు. ఇంత వరకూ ఎవరూ స్పృశించని అంశాలను తాను సృజించినందుకు కించిత్తు గర్వంగా కూడా ఉందన్నాడు. (Nov 7, 1982 లో ఈ శిల్పం U.S. లో ఆవిష్కరించబడింది)

డాడాయిజన్ని ప్రేమించే ఇతను అప్పుడప్పుడు విధ్వసంక ధ్వంస సృష్టి చేస్తు ఉంటాడు. వయెలిన్ వినడానికే కాదు, చూడ డానికి కూడా అత్యంత సుందరమైనది. స్త్రీ సౌందర్యముతో పోల్చదగినదీ, ''చక్కనమ్మ చిక్కినా అందమే'' అన్నట్లు వయెలిన్‌ను విరిచినా, పగుల గొట్టినా, అది ఏ రూపంలో నున్నా దాని సౌందర్యం చెక్కు చెదరదని, అది మరో రూపంలో శోభిల్లుతుందని అంటాడు. దానికి ప్రతికగా ఒక వయెలిన్‌ను తీసుకొని దానిని పగులగొట్టి తిరిగి పేర్చి దాని సౌందర్యం చెడలేదు చూడండంటాడు. 1975వ సంవత్సరము నుంచీ తన కోపతాపాలను ప్రదర్శించే విధ్వంసాత్మక ధ్వంస సృష్టి శిల్పాలలో ప్రారంభించాడు. ఒక వయెలిన్‌ను కాల్చి బూడిద చేసిన తరువాత ఆ బూడిదలో కూడా ఒక గొప్ప కళారూపాన్ని చూడవచ్చునేది అతని సిద్ధాంతం. ఒక వస్తువు యొక్క రూపు రేఖలు చెడగొట్టడం లేదా భస్మీ పటలం గావించటం ద్వారా దానిలోని సౌందర్యానికి శాశ్వత స్థానాన్ని మరొక రూపంలో పొందుపరుస్తున్నాను అని పిలాసఫీ చెబుతాడు. కార్ల దొంతర్లను పేర్చినట్లుగానే రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న అనేకానేక దేశాలలోని యుద్ధ టాంకులను కూడా ఈ విధంగా ఒక స్థూపంలో బంధించాలనుకున్నాడు. కానీ ఇంతవరకూ పెట్టుబడిదారు డెవరూ దొరకలేదు. అదింకా ప్రణాళిక రూపంలోనే ఉంది.

# సమసమాజంలో మానవాత్మ

మూలం : ఆస్కార్ వైల్డ్ అనువాదం : సర్దేశాయి తిరుమల రావు

(గత సంచిక తరువాయి)

మానవుని నిజమైన వ్యక్తిత్వం, చూడడానికి అద్భుతమైనది. ఇది సహజంగా సున్నితంగా పువ్వువలె, చెట్టువలె పెరుగుతుంది. వైషమ్యం వాదవివాదం అంటే దీనికి సరిపోవు. విషయసేకరణ దీని పనికాదు. దీని స్వత్వం, జ్ఞానం, దీని విలువ వస్తువు వల్ల కట్టబడదు. దీనికేమీ వద్దు, దీనికన్నీ వుంటాయి. దీని నుంచి ఎంతైనా తీసికోండి. ఇది ఇంకా కలిగి ఉంటుంది. ఇది ఇతరుల జోక్యానికి పోదు. తన మాదిరి వారినీ ఉండుమని అడుగదు. వారు వేవేవిధంగా ఉన్నారు. కావున వారంటే దీని క్ష్టం. సుందర వస్తువు. సౌందర్యం మూలాన ఎట్లు తోడ్పడుతూందో వ్యక్తిత్వం కూడా సహాయకారి అవుతుంది. శిశు వ్యక్తిత్వలలోని అద్భుతంవంటిదీ వ్యక్తిత్వం.

కావలెనంటే దీని అభివృద్ధికి క్రైస్తవమతమూ తోడ్పడగలదు.* లేదంటే క్రైస్తవమత ప్రమేయం లేకుండానే అభివృద్ధి చెందగలదు. గతం గురించి శోచించదు. తన స్వంత శాసనాన్ని తప్ప వేరే శాసనాన్ని ఒప్పుకోదు. బయటి అధికారాన్ని శిరసావహించదు. తనని దృఢతరం చేసే వాళ్ళంటే వ్యక్తిత్వం ప్రేమిస్తుంది. వాళ్ల గురించి అనుకొంటుంది. అటువంటి వాళ్ళలో క్రీస్తు ఒకడు.

''నిన్ను నీవు తెలుసుకో'' అని ప్రాచీన ప్రపంచపు ద్వారాల మీద వ్రాసికొనిరి.** నవీన ప్రపంచ ద్వారాల మీద ''నీవు నీవుగావుండు'' అని వ్రాయబడుతుంది. క్రీస్తు సందేశమిదే. ''నీవు నీవుగా వుండు'' క్రీస్తు రహస్యమూ ఇదే.

ఏసు పేదల గురించి మాట్లాడేటప్పుడు వ్యక్తిత్వం కలిగిన వాళ్ల గురించే మాట్లాడుతున్నాడు. ధనికుల గురించి ప్రస్తావించినపుడు వ్యక్తిత్వం వృద్ధికాని వాళ్ళ గురించి మాట్లాడుతున్నాడు.

ఏసు స్వంత ఆస్తి సంపాదించుకోనిచ్చిన మనదిలాంటి సమాజంలో మెలగినాడు. ఆయన బోధించింది అర్ధ ఆకలితో బూజు పట్టిన ఆహారం తినుడనీ, చిరిగిపోయిన మురికి గుడ్డలు ధరించండనీ, భయంకరమైన, అనారోగ్యకరమైన కొంపల్లో పడి వుండండనీ కాదు, ఆరోగ్యకరమైన, ఆనందకరమైన పరిస్థితుల్లో బ్రతకడం తప్పనీ కాదు. అట్టి ఉపదేశం అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ తప్పయి ఉండేది. ఏసు బోధన యొక్క ఆంతర్యమిది. ఇతడు మనిషితో ఇట్లా అంటున్నాడు. ''నీకద్భుతమైన వ్యక్తిత్వం వుంది. దానిని అభివృద్ధిచేసుకో. నీవు నీవుగా ఉండు. బయటి వస్తువులని

---

* వైల్డ్ ఎంత స్వేచ్ఛాభావుకుడైనా క్రైస్తవమతం మీద విశ్వాసం మెండు. ముఖ్యంగా ఏసుక్రీస్తు వ్యక్తిత్వం మీద. ఇది ఆయన జైలులో వ్రాసిన ''డిప్రొఫండిస్'' అనే గంభీర వ్యాసంలో వ్యక్తం అవుతుంది. ఈ వ్యాసంలో ఆయన వాడిన ''ఆత్మ'' దీనిని సూచిస్తుంది.

** ఇది గ్రీకుల తత్వం. మన ''ఆత్మానాం విద్ధి'' లాంటిది.

సేకరించుకోవడం వల్ల పరిపూర్ణత్వ మబ్బుతుందని భావించకు. నీయభిమాన ధనం నీలోనే ఉంది. ఇది గ్రహించితివా, ధనం కొఱకాశించవు. ధనాదులు దొంగలింపబడతాయి. నిజమైన ఐశ్వర్యం దొంగలింపబడదు. నీ ఆత్మ భాండారంలో ఎన్నో అమూల్య వస్తువులున్నాయి. వాటిని ఎవరూ దొంగలించలేరు. బాహ్యవస్తువులు అడ్డురాకుండా నీ జీవితాన్ని మలచుకో. ఆస్తిని వదలించుకో. దాని మూలాన్న నిరంతర వ్యధ, అంతులేని పని, అంతులేని అన్యాయం కలుగుతాయి. స్వంత ఆస్తి అడుగడుగునకూ వ్యక్తిత్వాన్నడ్డపఱుస్తుంది.'' పేదవాళ్ళు తప్పనిసరిగా మంచివాళ్ళనీ, ధనవంతులు తప్పనిసరిగా చెడ్డవాళ్ళనీ ఏసు ఎక్కడా అనలేదనేది గుర్తుంచుకోండి. అట్లనడం సరికూడకాదు. పేదవాళ్ళకంటే ధనవంతులు నీతినియమాల్లోనూ, నడవడిలోను, బుద్ధి మంతత్వంలోను లెస్స. ఎప్పుడూ డబ్బు గురించి, ధనవంతులకంటే ఎక్కువగా వెంపరలాడే వర్గం ఏదైనా వుంటే అది పేదల వర్గమే. పేదలు వేరే విషయాన్ని అనుకోలేరు. పేదగా వుండడంలోని హీనతే ఇది. మనిషి తనకున్న దాని మూలంగాకాక, తనుచేసేదాన్ని బట్టికాక, తాను ఏమై ఉన్నాడో దానిబట్టి పరిపూర్ణత చెందుతాడనే ఏసు చెప్పింది. ఒక ధనిక యువకుడు ఏసు దగ్గరకు వస్తాడు. వాడు మంచి పౌరుడు. చట్టాలని ఉల్లంఘించలేదు. మత విధులను జవదాటలేదు. మంచి మర్యాదస్థుడు. వానితో ఏసు ఇలాగుంటాడు. ''నీ ఆస్తిని పంచుము. పరిపూర్ణత్వానికది ఆటంకం. నీకది గుదిబండ. భారం. నీ వ్యక్తిత్వానికది అనవసరం. నీకు నిజంగా కావలసింది నీలోనేవుంది. నీ బయటకాదు''. తన సహచరులకూ ఏసు ఇలానేచెప్పినాడు. దాన్ని గురించి, దీన్ని గురించి బెంగపడుతూ ఉండవద్దు అన్నాడు. ఇతర వస్తువులతో ఏంపని? మనిషి స్వయం సంపూర్ణుడు..వీళ్ళు విశాల ప్రపంచంలోకి పోయినపుడు ఆ ప్రపంచం వాళ్ళతో ఏకీభవించలేదు. అది తప్పనిసరి అయింది. వ్యక్తిత్వమంటే ప్రపంచానికి సరిపోదు. దీనిని విసుగుకో కూడదు. ప్రశాంతంగా తమకు తామై ఉండవలె. బాహ్యవస్తువులు ముఖ్యంగావని నిరూపించవలె. లోకులు తిట్టిన మారు పలుక కూడదు. దీని అర్థమంతా ఏమి? మనిషి గురించి చెప్పే మాటలవల్ల మనిషి మారిపోడు. వాడేదో అదే. ప్రజాభిప్రాయం సత్తాలేనిది. ప్రజలు దౌర్జన్యం చేసినా, ప్రతి దౌర్జన్యం చేయకూడదు. చేస్తే వాళ్ళ తగ్గుస్థాయికి దిగజారుటే. కారాగారంలో కూడా మనిషి స్వతంత్రంగా ఉండగలడు. అతని ఆత్మస్వేచ్ఛగా ఉండగలదు. అతని వ్యక్తిత్వం ఏ అవస్థపడకుండా ఉండగలదు. అతడు శాంతంగా ఉండగలడు. వ్యక్తిత్వం నిగూఢమైంది. మనిషిచేసే పనుల వల్లనే వాని విలువ కట్టజాలము. మనిషి చట్ట ప్రకారమే నడుచుకోవచ్చును. కాని వాడు చవట అయివుండవచ్చు. చట్టాన్ని ఉల్లంఘింపనూ వచ్చు. వాడు మేటి కావచ్చు. చెడ్డ ఏమీ చేయకనే చెడ్డవాడుగా ఉండవచ్చు. ఏదైనా ఒక పాపకార్యం చేసినా, దాని ద్వారా ఆత్మ పరిపూర్ణత సాధించుకోవచ్చును.

ఒక స్త్రీ వేశ్యావృత్తి నవలంబించింది. ఆ ప్రేమాయణం మనకు చెప్పలేదు. ఆమె ప్రేమ గొప్పదిగా ఉండి ఉంటుంది. ఎందుకంటే ఏసు ఆమె పాపాలను క్షమిస్తాడు. ఆమె పశ్చాత్తప్త అయినందుకు కాదు. ఆమె ప్రేమ గొప్పది అయినందుకు. తర్వాత ఏసు, చనిపోక ముందు, విందుకు కూర్చుంటాడు. అప్పుడీ స్త్రీ వస్తుంది. ఏసు తలపై ఖరీదైన సుగంధ తైలాలు చల్లుతుంది. ఈయన సహచరులు దీనిని

వారింపబోతారు. ఇట్లు చేయుట దుబారా. దీనికయ్యే డబ్బుతో ఏదైనా దానధర్మాలు చేయవచ్చునని ధర్మ పన్నాలు పలుకుతారు. ఏసు ఒప్పుకోలేదు. భౌతిక వాంఛలు బలీయమైనవి. అంతకంటే బలీయమైంది ఆధ్యాత్మిక తపన. ఒకానొక దైవీయ ముహూర్తాన, వ్యక్తి ఆ తపనని వెలిబుచ్చి పరిపూర్ణత సాధించుకోవచ్చును అని ఏసు సెలవిచ్చినాడు. ప్రపంచం ఆ స్త్రీని ఇప్పటికీ పుణ్య మూర్తిగా పూజిస్తున్నది.

అవును వ్యక్తిత్వంలో ఇతర సూచకాంశాలు కూడా ఇమిడి ఉన్నాయి. సమ సమాజం సంసార పద్ధతిని నిర్మూలిస్తుంది. ఆస్తి పద్ధతి పోవడంతో, వివాహవ్యవస్థ కూడా ఆ రూపంలో ఉండదు. ప్రణాళికలో ఇదొకభాగం. చట్టబద్ధమైన ఆంక్షలతొలగింపుతో, వ్యక్తిత్వం పరిపూర్ణంగా అభివృద్ధి చెందే పరిస్థితుల మూలానా, స్త్రీ పురుషుల సాంగత్యం ఇప్పటికంటే సుందరంగా ఉత్తమంగా అవుతుంది. ఏసుకిది తెలుసు. సంసార బంధాన్ని ఆయన ఒప్పుకోలేదు. నీ తల్లి, సోదరులు నిన్ను చూడడానికి వచ్చినారని చెప్పగా ఆయన ''నాకు తల్లి ఎవరు? సోదరులెవరు?'' అని అడిగినాడు. ఆయన అనుచరులలో ఒకడు, చనిపోయిన తన తండ్రిని ఖననం చేసేందుకు పోతాననిచెప్పగా ''చచ్చినవాళ్లు చచ్చినవాణ్ణి పూడ్చునివ్వు'' అనే కటువు మాట అన్నాడు. వ్యక్తిత్వం మీది ఇలాటి హక్కును ఆయన ఒప్పుకోలేదు.

క్రీస్తు జీవితంలాంటి జీవితం ఎవడు గడుపుతాడంటే ఎవడు తానుతానుగా ఉంటాడో వాడే గడుపుతాడు. వాడు గొప్ప కవికావచ్చు. శాస్త్రజ్ఞుడు కావచ్చు, కళాశాల విద్యార్థి కావచ్చు. గొర్రెల కాపరి కావచ్చు, షేక్సుపియరు వలె నాటకాలు వ్రాసేవాడు కావచ్చు. స్పినోజా మాదిరి దైవ చింతకుడు కావచ్చు. తోటలో ఆడుకొనే పసిపాప కావచ్చు. సముద్రంలో వలలు వేసే బెస్తవాడు కావచ్చు. ఎవరైతేనేం. తన ఆత్మ వికాసాన్ని సాధించితే చాలు. నీతి జీవితాన్నీ అనుకరణ చేయరాదు. డామియన్ ఫాదర్, కుష్ఠురోగులకు సేవచేయడానికి పోయి తన వ్యక్తిత్వాన్ని సుసంపన్నం చేసికొన్నాడు. ఆయన క్రీస్తులాంటి వాడే సరి. అయినా ఆత్మ వ్యక్తిత్వాన్ని సంగీతంలో సాధించినతాగ్నరు కంటెను, కవిత్వంలో సాధించిన షెల్లీ కంటెను ఎక్కువకాదు. మనిషి ఒకే లాగున ఉండడు. ఎంత మంది అసంపూర్ణ మానవులున్నారో అన్ని పరిపూర్ణతలున్నాయి. దాన ధర్మాలనైనా ఒప్పుకొని స్వతంత్రంగా ఉండవచ్చు కానీ గతానుగతికమైన వర్తనాన్ని ఒప్పుకోరాదు. అది స్వేచ్ఛను హరిస్తుంది.

ఇటువంటి వ్యక్తిత్వాన్నే సమసమాజం ద్వారా మనం సాధించుకోవలసింది. తత్ఫలితంగా రాష్ట్రం, ప్రభుత్వం అనే భావాన్నే విడనాడవలెను. క్రీస్తుకంటే పూర్వమే ఒకానొక విజ్ఞుడు చెప్పినాడు. మానవాళిని దాని మానాన దానిని వదలి వేయడమనేది ఒకటుంది అని. మనుష్యులను పరిపాలించడమనేది హుళక్కి. అన్ని విధాలయిన ప్రభుత్వాలూ విఫలమయినాయి. నిరంకుశ పాలన అందరికీ అన్యాయం చేసింది. నిరంకుశునకూ అన్యాయం చేసింది. వాడంతకంటే మంచి పనులు చేసి ఉండేవాడు. ఏదోకొద్ది మంది చేతిలోని ప్రభుత్వం చాలా మంది కన్యాయం చేస్తుంది. మూకుమ్మడి ప్రభుత్వం కూడా ఎవరికో

కొందఱికైనా అన్యాయం చేస్తుంది. ప్రజాస్వామ్యం మీద చాలా ఆశలుండేవి. ప్రజాతంత్రం అంటే ప్రజల కొఱకు, ప్రజల చేత, ప్రజలను దుడ్డు కర్రలచే బాదడమే అనేది తెలిసి పోయింది. అన్ని విధాలయిన అధికారాలు ఆత్మభ్రష్టకారాలని నేను చెబుతున్నాను. అధికారం, దాన్ని చెలాయించేవాణ్ణి భ్రష్టపరుస్తుంది. చెలాయింపబడే వారినీ భ్రష్టపరుస్తుంది. అధికారాన్ని హింసాత్మకంగా, మొరటుగా, క్రూరంగా చెలాయించే దానిలో మంచి ఫలితం లేకపోలేదు. అది మనిషిలో ఉన్న తిరుగుబాటు ధోరణి నీ, వ్యక్తిత్వాన్ని బయటికి తెస్తుంది. అధికారంను దయాదాక్షిణ్యాలతో, పురస్కారాల, సన్మానాల ఆధారంతో చెలాయిస్తే నీతిని చెడగొట్టుతుంది. ఎందుకంటే ప్రజలు తమపై మోపిన అసహ్య భారాన్ని మఱచిపోయి సుఖంగా ఉన్నామనుకుంటూ పెంపుడు జంతువులవలె జీవిక సాగిస్తారు. వేఱే వాళ్ళ భావాలు భావిస్తున్నామనీ వేఱేవాళ్ళ అంతస్తు ప్రకారం బ్రతుకుచున్నామనీ, వేరేవాళ్ళ చేతులు మారిన దుస్తులు ధరిస్తున్నామనీ వాళ్ళ తెలివిడిలోనికి కాదు. ఒకగొప్పమేధావి అంటాడు కదా ''స్వేచ్ఛ కావలసిన వానికి అంధానుకరణ కూడదు''. అధికారం ప్రజలకాసపెట్టి, లంచమిచ్చి ఏదోవిధంగా గ్రుడ్డిగా అనుసరించేటట్లు చేసి వారిని మస్తుగతిన్న బర్బరులుగా చేస్తుంది.

అధికారంతోపాటే, శిక్షపోతుంది. ఇదెంతైనా మేలు. చరిత్ర చదివితే డోకు వచ్చినట్లవుతుంది. దుష్టులు చేసిన దౌష్ట్యాలవలనగాక, మంచివాళ్లుచేసిన శిక్షలవలనా, అప్పుడప్పుడు సంభవించే నేరాలవలన గాక, అదే పనిగా శిక్షలువేయడం వలననే సమాజం మృగప్రాయం అవుతుంది. శిక్షలెక్కువైన కొద్దీ నేరమూ ఎక్కువౌతుందనేది స్పష్టం.

కాబట్టే ఆధునిక శాసనకారులు శిక్షలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. శిక్షతగ్గిస్తే నేరమూ తగ్గుతుంది. శిక్షలేకనే పోతే, నేరమూ సమసిపోతుంది. ఒకవేళ నేరం చేయబడితే, దానిని ఒకానొక రోగంగా పరిగణించి చికిత్స ద్వారానూ, సానుభూతి ద్వారానూ కుదుర్చుతారు. నేరస్థులు అని నేడు ఎవరినంటామో, వారు నేరస్థులే కాదు. నేటి నేరాలకు మూలం పాపకార్యం కాదు. ఆకలి. ఈ కారణం చేతనే మన నేరస్థులు మనస్తత్వ శాస్త్ర రీత్యా ఉత్సుకతకలిగింపరు. ఈ నేరస్థులు అద్భుత మాక్బెత్తులు కారు. భయంకర వాట్రినులు * కారు. కేవలం తినడానికి లేని సామాన్య మర్యాదస్థులైన సామాన్య జనం. స్వంత ఆస్తిని తీసి వేసినపుడు నేరం చేసే పనివుండదు. అది ఉండదు కూడ. అన్ని నేరాలు ఆస్తి గురించే కాదనుకోండి. ఇంగ్లీషు చట్టం మనిషి ఎటు వంటివాడని కాక అతనికెంత ఆస్తివున్నాదనే విషయం మీదనే అత్యంత కఠిన క్రూర శిక్షలు విధిస్తుంది. (హత్యానేరాన్ని మినహాయించి, మరణదండన, కఠిన శిక్షతోడి కారావాసం కంటే అధ్వాన్నం అనుకొంటే - అయితే ఈ విషయంలో మన నేరస్తులు ఏకీభవించరని తలుస్తాను). ప్రతి నేరమూ ఆస్తి విషయమై కాకపోయినప్పటికినీ, ఆస్తిని కలిగివుండుట అనే తప్పుడు వ్యవస్థ నుండి పుట్టిన దైన్యమూ, ఉక్రోషమూ, డీలాపడిపోవుట వలన నేరాలు పుట్టుకరా వచ్చును. అందుకే ఈ వ్యవస్థపోతే ఈ బాధలూ పోతాయి. సమాజంలోని ప్రతి వ్యక్తికీ చాలినంత

---

* "Terrible Vautrins" అని మూలం

ఉంటే. వాడు వేరే వాళ్ళ జోలికి పోడు. అసూయ చాలా నేరాలకి మూలం. ఆస్తి అసూయకు మూలం. వ్యక్తిత్వంలోనా సమసమాజంలోనా మనిషికి అసూయ ఉండదు. కమ్యూనిస్టు సూత్రాలతో నడుస్తూండే తెగలలో అసూయ అనే వ్యసనం ఉండకుండుట విశేషం.

రాష్ట్రం పరిపాలించకుండా ఉంటే మఱేమిచేయవలెనని మీరడగవచ్చును. రాష్ట్రం స్వచ్ఛందంగా నిత్యావసర సరకులను ఉత్పత్తి చేయడానికి, పంపిణీచేయడానికి ఉండవలెను. రాష్ట్రం ఉపయోగపడే వస్తువులను చేయవలెను. వ్యక్తి సుందరంగా ఉండే వస్తువులను చేయవలెను. ఇక కాయకష్టం అనే మాట ఉంది. ఈ రోజు కాయకష్టంలోని హుందాతనం గురించి ఎంతో అర్థరహితంగా మాటలూ, వ్రాతలూ సాగుతున్నాయి. కాయకష్టంలో గాంభీర్యం సోలలేకపోగా అది మిక్కిలి అవమానకరమైంది. ఆనందం ఇవ్వని ఏపని చేయడమూ మనస్సుకూ, నీతికీ పెట్టు. చాలా రకాలైన కాయకష్టాలు ఆనందరహితాల నడంలో సందేహంలేదు. తూర్పుగాలి వీస్తుండగా చిత్తడిబాటను ఎనిమిది గంటలు ఊడ్చడమే వేసరికతో కూడినపని. పైగా మానసిక, నైతిక, భౌతిక గౌరవాలతో ఊడ్వడం అసాధ్యం అని నాకనిపిస్తుంది. ఆనందంతో ఊడ్వడానికి అడలుపుట్టి తీరుతుంది. ఇటువంటి మురికి పనులు యంత్రాలు చేయవలసినవి. మురికిని తోడేసేదానికన్నా మనిషికి చేయవలసిన మంచి పనులెన్నో ఉన్నాయి. ఇట్టిరకపు పనంతా యంత్రాలు చేయవలెను.

ఇట్లా అవుతందనడంలో నాకు సందేహంలేదు. ఇప్పటి వరకు చూస్తే మనిషి యంత్రానికి కొంత వరకు బానిస అయినాడు. తన పని చేసే యంత్రాన్ని కనుగొన్న వెంటనే మనిషి పస్తుపడడం మొదలెట్టిన విషయం శోచనీయమైంది. దీనికి కారణాలు ఆస్తి ఫద్ధతి, పోటీ పద్ధతీని. అయిదు నూర్లమంది పని చేసే యంత్రాన్ని ఒకడే కొంటాడనుకోండి ఆ ఐదునూర్లమంది వుద్యోగాలూడుతాయి. పనిలేనందువల్ల దొంగతనం ప్రారంభిస్తారు. ఒక యంత్రం ఉత్పత్తిచేసిన సరుకును దాచిపెట్టుకొంటాడు. వీని దగ్గర తనకు కావలసిన దానికన్నా అయిదు వందలరెట్లున్నది. ఆ యంత్రమే గనుక అందరిదీ అయివుంటే అందరికీ ప్రయోజనముండేది. సమాజానికెంతో దోహదకారిగ వుండేది. మానసికంగానిపనీ, వేసరిక కలిగించేపనీ, భీతాహంకలిగించే పనీ, కసుమాలపు పరిస్థితులలో చేయవలసిన పనీ యంత్రాలే చేయవలెను. యంత్రాలు బొగ్గుగనులలో పనిచేయవలెను. తోటి పనులూ, పాచిపనులూ చేయవలెను. స్టీమరులో బొగ్గు వేసేవిగా వుండవలెను. వీధులను ఊడ్వవలెను. అంతెందుకు? విసుగూ, ఆయాసమూ కలిగించే ప్రతిపనీ యంత్రంచేయవలెను. ఇపుడు యంత్రం మనిషితో పోటీపడుతున్నది. సక్రమ పరిస్థితులలో యంత్రం మనిషికి సేవచేస్తుంది. యంత్రం భవిష్యం ఇదేననడంలో సందేహంలేదు. పల్లెటూరి కామందు హాయిగా కునుకుతీస్తుంటే, చెట్టుపెరుగుతూనే ఉన్నట్లు, మానశాళి కులాసాగా కాలం వెళ్ళబుచ్చుతూంటే, విరామన్ననుభవిస్తుంటే, సుందర వస్తువులు చేస్తుంటే, సుందర విషయాలని చదువుతూంటే, ఏదీ లేదా, ప్రపంచం గురించి ఆనంతంతో ప్రశంసాత్మకంగా ఆలోచిస్తూవుంటే, యంత్రాలు 'కావలసిన పనులు చేసిపెడుతుంటాయి. నాగరికతకు బానిసలు అవసరమనేది వాస్తవమే. ఈ విషయంలో గ్రీకులను చెప్పవలెను. అసహ్యామైన, వికారమైన, విసుగుపుట్టించే పనిని చేసేందుకు బానిసలుంటేగాని సంస్కృతి. ఆలోచన, అసాధ్యమవుతాయి.

మానవ బానిస తనం తప్పు, అవినీతికరమైంది. యంత్రాల బానిస తనం మీదనే ప్రపంచ భవితవ్యం ఆధారపడింది. శాస్త్రజ్ఞులకు, క్రుంగదీసే లండను నగరంలోని తూర్పు దిక్కులోవుండే మురికి వాడలకు* పోయి వస్తున్నవారికి నాసిరకం కోకోపానీయాన్నీ, పాతబొంతలనీ పంచే పనిలేనప్పుడు, వాళ్ళకు అద్భుతములయిన విషయాలని కనిపెట్టేందుకు ఉల్లాసకరమైన తీరిక ఉంటుంది. అప్పుడు వారికి ఆనందమే, ప్రతి ఒక్కరికీ ఆనందమే. ప్రతి ఊరికి, ప్రతి ఇంటికీ నిలువ చేసుకొనేందుకు చాలా శక్తినిల్వలుంటాయి. కావలసిన రీతిగా ఈ స్థాణుశక్తిని వేడిమిగా, వెలుతురుగా చలన శక్తిగా మార్చుకోవచ్చును. ఇది ''అతలమా''? **అతలంలేని ప్రపంచపటం చూచుటకు కూడా యోగ్యమైంది కాదు. ఎందుకంటే మానవాళి ఎల్లప్పుడూ కాలు పెట్టేందుకు తహతహ లాడే దేశం ఆపటంలో లేదు. ఆ దేశంను చేరి, ఇది బాగుందని భావించి తెరచాపలు ఎగుర వేస్తుంది. అతలాలని సాధించుకొనుటే ప్రగతి.

యంత్రాలని తగినట్లు అమర్చి సమాజం ఉపయోగకర వస్తువులను తయారు చేస్తుందనీ, వ్యక్తి సుందర వస్తువులను, తయారు చేస్తాడనీ అన్నాను. అది ఆవశ్యకమే కాక వీటిని కలిగేందుకు ఏకైక మార్గం కూడా: ఇతరులకుపయోగపడే వస్తువుల తయారు చేయడంలో మనిషి ఎక్కువ శ్రద్ధా తీసికోడు. తనలోని శక్తిని పూర్తిగానూ వినియోగించడు. అటులనే కళాకారులని ఇట్లా చేయుము అని సమాజంకానీ, ప్రభుత్వం కానీ శాసించినపుడు కళ నశిస్తుందిలేదా తగ్గు స్థాయికి దిగజారిపోతుంది. లేదా ఒకే మూసలో పోసినట్లు తయారవుతుంది. కళ విశిష్ట మానసిక ప్రవృత్తి యొక్క విశిష్టఫలితం. కవి వ్యక్తిత్వ విశేషం ద్వారానే కళకా సౌందర్యం వచ్చుట. కళకూ ఇతరుల అభీష్టానికీ సంబంధం లేదు. ఇతరులకేమి కావలెనో దాన్నే సరఫరా చేసేందుకు కళాకారుడు ప్రయత్నించెనా, వాడు కళాకారుడే కాడు. విధూషకుడైనా అవుతాడు లేదా వ్యాపారస్థుడైనా అవుతాడు. కళాకారుడు అని పిల్వబడేందుకు వాడు హక్కు కోల్పోతాడు. ఈ ప్రపంచంలోకెల్లా కళ, వ్యక్తిత్వపు గాఢతను చిత్తవృత్తి. ఇదే వ్యక్తిత్వపు నిజమైన చిత్త వృత్తి అని కూడా అంటాను. కొన్ని పరిస్థితులలో నేరం వ్యక్తిత్వాన్ని సృష్టించినప్పటికీ, ఇతరులను లెక్కలో తీసికొని జోక్యం కలిగించుకోవలసి వస్తుంది. అది ఆచరణ రంగానికి చెందింది. కళాకారుడు ఏకాకిగా ఇరుగు పొరుగు వాళ్లతో సంప్రతింపులు. జోక్యం లేకుండానే, ఇతరుల జోక్యం లేకుండానే, సుందర వస్తువును రూపొందించగలడు. తన ఆనందానికి అట్లా చేయకపోతే కళాకారుడే కాడు.

కళ వ్యక్తిత్వం యొక్క గాఢరూపం అయినందువల్ల దానిపైన అజమాయిషి చెలాయించేందుకు జనం ప్రయత్నిస్తుంటారు. ఇటువంటి అజమాయిషి అవినీతికరం, అసహ్యాకరం, హేయకరం, భ్రష్టకరం. అది వాళ్ళ తప్పుకాదు లెండు. ప్రతి కాలంలోనూ జనం తప్పుగా పెంచబడ్డారు. కళ తమ అభీష్టానికి అనుగుణంగా ఉండవలెననీ, అభిరుచి రాహిత్యాన్ని సంతోషపెట్టవలెననీ, చూపించే

* ఇచట వైల్డ్ '' ఈస్ట్ ఎండ్'' అనే మాట వాడినాడు.

** ఇచట వైల్డ్ '' ఉటోపియా'' అనే మాటవాడినాడు. దీనిని నేను అదే అర్థంలో, శబ్దాల్లో ''అతలం'' అని సంస్కృతీకరించినాను.

చూపవలెననీ, భుక్తాయాసం తీరేటట్లు ఖుషీ చేయవలెననీ, వారి అవివేకానికి వారికే మేసరిక వచ్చినప్పుడు మనస్సుకు కొంత వినోదం కల్గించవలెననీ జనులు కోరుతారు. జనాభిరుచికి నచ్చేందుకు కళ ప్రయత్నించకూడదు. జనమే కళాభిమతానుయాయులు కావలెను. ఈ రెంటిలో చాలా భేదముంది. శాస్త్రప్రయోగాల ఫలితాలు, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఉండరాదనీ, విషయజ్ఞానంలేని నమ్మకాలను ఊపివేసేవిగా ఉండ రాదనీ చెప్పినా, తాత్వికుని ఆలోచన ఎంతదూరం సాగినా, అతని వినిగమనాలు, ఆవిషయాల జోలికే పోనివారి భావాలతో ఏకీభవించవలెనని చెప్పినా, ఈ కాలంలోని శాస్త్రజ్ఞుడు, తాత్వికుడు ఎంతైనా నవ్వుకొంటారు. అయినా కొద్దికాలం క్రితమే శాస్త్రమూ, తత్వమూ, మృగప్రాయమైన ప్రజాభిప్రాయానికీ, సమాజపుటజ్ఞానికీ మతాధికారుల దురహంకారానికీ లేక ప్రభుత్వపు భీతాహానికి ఆహుతి అవుతుండేవి. ప్రజాభిప్రాయం, మతాధికారులు, ప్రభుత్వాలు శాస్త్రతత్వం వ్యక్తిత్వ స్వాతంత్ర్యాలలో జోక్యం కలిగించుకొనే ప్రయత్నాలని అణచివేసినాము. కానీ, కాల్పనిక కళ వ్యక్తిత్వంలో జోక్యం కలిగించుకొనే ప్రయత్నాలు ఇంకను తచ్చాడుతున్నవి. తచ్చాడుటేమి? రెచ్చగొట్టేటట్లూ దండెత్తేటట్లు, పాశవికత కలిగేటట్లుంటేను!

ఇంగ్లాండులో ఈ అపాయాల నుంచి ప్రజలకు ఆసక్తి లేని కళలు తప్పించుకొన్నాయి. ఇచ్చట నా మనసులో ఉన్న ఉదాహరణ కవిత్వం. ఇంగ్లాండులో మనకు మంచి కవిత్వం ఉంది. ఎందుకంటే ప్రజలు దీనిని చదువరు. పర్యవసానంగా దానిని ప్రభావితమూ చేయరు. ప్రజలకు కవులని అవమాన పర్చడమంటే ఇష్టం. ఎందుకంటే కవులు వ్యక్తిత్వం కలవారు. వారి నవమాన పర్చిన తర్వాత వారి మానాన్న వారిని పోనిస్తారు. నవల, నాటకాలలో ప్రజలకు ఆసక్తిమెండు. ప్రజాప్రభావం ఫలితం చాలా అపహాస్యభాజనంగా ఉంది. ఇంగ్లాండు వలె ఏ ఇతర దేశమూ అంత అధ్వాన్నంగా ఉండే, విసుగు కలిగించే నవలనూ, అంత అవివేకమైన, అసభ్యమైన నాటకాలనూ ఉత్పత్తి చేయదు. అది అటులనే ఉండవలెను. జనప్రియ నవలాకారునిగా ఉండుట చాలా సులభమూ, చాలా కష్టమూను. చాల సులభం ఎట్లంటే ప్రజలకు కావలసిన ఇతివృత్తం శైలి, జీవితం వర్ణనం, సాహిత్య సామాగ్రి అత్యల్ప శక్తుల యొక్కయూ అవ్యుత్పన్న మనస్కత యొక్కయూ అందుబాటులో ఉంటాయి. చాలా కష్టం ఎందుకంటే ఈ అవసరాలు తీర్చేందుకు కళాకారుడు తన ప్రవృత్తికి ద్రోహం చేయవలసిరావడం. రచన ఆనందంకొరకు కాక, మిడిమిడి చదువులవారి వినోదం కొర్కై చేయవలసి రావడం. దీని కోసం తన వ్యక్తిత్వాన్ని అణచి వేసికొని తన సంస్కృతిని మరచిపోయి శైలిని, నాశనం చేసుకొని, తన విలువలనన్నింటినీ దిగవిడువ వలసి వస్తుంది. నాటక విషయంలో కొంతనయం. నాటకాలు చూచే వాళ్లకి విషయం విరళంగా ఉండవలెకానీ, విసుగు జనింప చేసేదిగా ఉండరాదు. వినోద ప్రదర్శనాలూ, ప్రహసనాలు జనప్రియమైన కళారీతులు. వినోదప్రదర్శనాలకై, ప్రహసనాలకై ఆనందకర రచనలు చేయవచ్చు. ఇట్టి రచనల విషయంలో ఇంగ్లాండులోని కళాకారునకు చాలా స్వేచ్ఛ ఈయబడింది. ఇంతకంటె పైస్థాయి రచనల వద్దకు వచ్చినామంటే, ప్రజలు చేసే అదుపుటొత్తిడి కన్పిస్తుంది. ప్రజలకు సరిపోనిది క్రొత్తదనం. ఇతి వృత్తి నవ్యతకై చేసే ప్రయత్నమంటే ప్రజలకి అరుచికరం. కళాశక్తి, ప్రగతి ఇతి వృత్త నవ్యతపైన ఎక్కువగా ఆధారపడివుంటాయి.

(సశేషం)

# Form IV (SEE RULE 8)


## Statement about ownership and other Particulars of MISIMI

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | Alapati Bapanna |
| Whether citizen of India | : | Yes |
| If foreigner, state the country of origin | : | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 4. Publisher's Name | : | ALAPATI BAPANNA |
| Whether citizen of India | : | Yes |
| If foreigner, state the country of origin | | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 5. Editor's Name | : | ANNAPAREDDY<br>VENKATESWARA REDDY |
| Whether citizen of India | : | Yes |
| If foreigner, state the country of origin | | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Limited<br>1-1-60/5, Iftekar Mansion Lane,<br>R.T.C. Cross Roads, Musheerabad,<br>Hyderabad - 500 020. A.P. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**ALAPATI BAPANNA**
Publisher


Date : March 1, 2004.



పగిలి రూపంమార్చుకొన్న వయొలిన్

చిత్రకారుడు : అర్మాండ్ ఫెర్నాండజ్

MISIMI/ మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD-191/20



కాంక్రీట్ ఉచ్చులో కార్లు

చిత్రకారుడు : అర్మాండ్ ఫెర్నాండజ్